Postel No. MBN/08/2016-2018




పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతములతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :23 | సంచిక :101 | సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | మంగళవారం 29 జులై 2025 | పేజీలు :12 | వెల రూ5 /-


## కొత్తగా రేషన్ కార్డు వచ్చిన
# వారికి గుడ్ న్యూస్...

### త్వరలోనే అందుబాటులోకి ఆ సేవలు

**హైదరాబాద్:** తెలంగాణలో కొత్తగా రేషన్ కార్డులు పొందిన కుటుంబాలకు త్వరలో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయంపై వైద్య, ఆరోగ్యశాఖ చర్యలు చేపట్టింది.రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా ఇప్పటి వరకు రేషన్ కార్డుల్లో నమోదైన కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందుతున్న సంగతి తెలిసిందే. అయితే 2025 జనవరి 1 నాటికి రాష్ట్రంలో ఉన్న మొత్తం 89.95 లక్షల రేషన్ కార్డులకు అనుబంధంగా 2.81 కోట్ల మంది పేర్లు ఆరోగ్యశ్రీ పోర్టల్‌లో నిక్షిప్తమయ్యాయి. వీరికి నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా నిబంధనల మేరకు ఉచిత వైద్య సేవలు అందుతున్నాయి.



**కొత్తగా 6 లక్షల కార్డులు: 30 లక్షల మందికి అవకాశం.**

ఈ ఏడాది జనవరి 26 నుంచి కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు సుమారు 6 లక్షల కొత్త కార్డులు జారీ కాగా, వాటితో కలిసి మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 95.56 లక్షలకు చేరుకుంది. ఇందులో కొత్తగా చేరిన లబ్ధిదారుల సంఖ్య 30 లక్షలు. వీరి వివరాలు త్వరలో ఆరోగ్యశ్రీ పోర్టల్‌లోకి ఎక్కించనున్నట్లు అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను తగిన ఆదేశాలు జారీ చేశారు.10.72 లక్షల మందికి సేవలు: రూ.1,590 కోట్ల బిల్లులు చెల్లింపు. డిసెంబరు 2023లో ప్రభుత్వం మారిన తర్వాత ఆరోగ్యశ్రీ సేవల వినియోగం మరింత పెరిగింది. మంత్రి దామోదర వెల్లడించిన వివరాల ప్రకారం, కొత్త ప్రభుత్వ పాలనలో ఇప్పటివరకు 10.72 లక్షల మందికి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు లభించాయి. ఈ సేవల కోసం ప్రభుత్వం ఆసుపత్రులకు మొత్తం రూ.1,590 కోట్లకు పైగా బిల్లులు చెల్లించినట్లు తెలిపారు.

**ప్రైవేట్ ఆసుపత్రులు ఆసక్తితో ముందుకు:**

ప్రతి నెలా సగటున రూ.100 కోట్ల వరకు ప్రభుత్వం బిల్లుల చెల్లింపులు చేయడంతో ప్రైవేట్ ఆసుపత్రులు కూడా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌లో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం 461 ప్రైవేట్ మరియు కార్పొరేట్ ఆసుపత్రులు ఈ సేవలు అందిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులలో అవసరమైన అన్ని ఔషధాలు కూడా ఉచితంగా అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.

## ఆ నిధులు పక్కదారి పట్టించారు..
# కేసీఆర్‌పై మంత్రి సీతక్క ఫైర్



**హైదరాబాద్:** గిరిజన సంక్షేమం విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించిందని ధ్వజమెత్తారు. ఆదివాసి గిరిజన ప్రాంతాలకు రోడ్లు, బ్రిడ్జిలు అవసరమని.. కానీ గతంలో నిధులు పక్కదారి పట్టించడంతో గర్భిణుల ప్రసవవేదన వంటి వార్తలు వస్తున్నాయని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో ఇవాళ(సోమవారం) మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు.ఏ ప్రభుత్వమైనా నిధులను పక్కదారి పట్టించవద్దని మంత్రి సీతక్క సూచించారు. ఎస్టీలకు కేటాయించిన నిధులను వారికే ఖర్చు చేయాలని కోరారు. కేటాయించిన నిధులను అదే అసెంబ్లీ నియోజకవర్గంలో, అదే జిల్లాలో సర్దుబాటు చేయాలి.. తప్ప మైదాన ప్రాంతాలకు తరలించవద్దని ఆకాంక్షించారు. సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టిస్తే ఏజెన్సీ ఏరియా వెనకబాటులోనే మగ్గిపోతుందని తెలిపారు మంత్రి సీతక్క. అందుకే ఎస్టీలకు కేటాయించిన ప్రతి పైసా వారికి ఖర్చు చేయాలని సూచించారు. ఎస్టీల్లో ఎక్కువమందికి ఉండటానికి ఇండ్లు లేవని తెలిపారు. కాబట్టి ఎస్టీల ఇండ్ల నిర్మాణం కోసం బడ్జెట్ నిధులను పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నామని అన్నారు. ఎస్టీలకు ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కనీస స్థల అర్హతను సడలించాలనే డిమాండ్ ఉందని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## ఎంబీబీఎస్ సీట్ల స్థానికతపై తెలంగాణ
# హైకోర్టు కీలక తాత్కాలిక తీర్పు



ఎంబీబీఎస్ సీట్ల స్థానికతపై తెలంగాణ హైకోర్టు కీలక తాత్కాలిక తీర్పును ఇచ్చింది. కేఎన్ఆర్‌యూహెచ్ఎస్ కౌన్సెలింగ్ దరఖాస్తుదారులను స్థానికులుగా పరిగణించాలని హైకోర్టు ఆదేశించింది. తుది తీర్పు వచ్చే వరకు రిజిస్ట్రేషన్‌లో చేర్చాలని ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు తీర్పుతో సుమారు 100 మంది అభ్యర్థులకు తాత్కాలిక ఊరట లభించింది. జూలై 30వ తేదీతో రిజిస్ట్రేషన్ ముగియనుండటంతో హైకోర్టు ఈ కీలక తీర్పు నిచ్చింది. శాశ్వత నివాసంతోనూ స్థానికత మంజూరు చేయాలని కోర్టు అభిప్రాయపడింది. గత ఏడాది ఇచ్చిన హైకోర్టు ఆర్డర్స్ ఫాలో కావాలని ఆదేశించింది. కాగా, జూలై 15వ తేదీన విడుదలైన ప్రాస్పెక్టస్, నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. నోటిఫికేషన్‌లోని రూల్ 3లో 4 ఏళ్ల చదువు/నివాస నిబంధనపై అభ్యంతర వ్యక్తం చేస్తూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. తాత్కాలిక తీర్పును ఇచ్చింది.

# సాంకేతిక నెపంతో అందని భరోసా....

### అసైన్డ్ పట్టాదారుల ఎదురుచూపులు

**మహబూబ్ నగర్ /నాగర్ కర్నూల్ జూన్ 25 (స్కై న్యూస్)** రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎప్పుడు లేని విధంగా 100% రైతులకు రైతు భరోసా పథకాన్ని అమలు చేశామంటూ ఒకవైపు సంబరాలు జరుపుకుంటున్న ఉమ్మడి పాలమూరు జిల్లాలో అనేక మంది లబ్ధిదారులు రైతు భరోసా అందక వ్యవసాయ కార్యాలయాలు బ్యాంకుల చుట్టూ ప్రదర్శనలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ అధికారులు సర్వేలు నిర్వహించి వాటి నివేదికల ఆధారంగా ప్రభుత్వం ఇటీవల రైతు భరోసా నిధులను మంజూరు చేసి వారి ఖాతాలో జమ చేసినట్లు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించుకుని తొమ్మిది వేల కోట్ల రూపాయల నిధులను రాష్ట్రవ్యాప్తంగా వారి ఖాతాలో జమ చేసినట్లు ప్రకటించుకుంటున్నారు గత తొమ్మిది రోజులుగా రైతుల ఖాతాలో రైతు భరోసా నిధులను జమ చేస్తున్న బ్యాంకు అధికారులు సాంకేతిక కారణాలను చూపెడుతూ రైతుల ఖాతాలో జమ చేయకపోవడం వల్ల పలువురు రైతులు అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వ భూములు మరియు అసైన్డ్ భూములకు కూడా రైతు భరోసా నిధులు జమ కాలేదని జిల్లాలోని కోడేరు మండలానికి చెందిన పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు మండలంలోని 429 మరియు 285 సర్వే నెంబర్లు సాగు చేసుకుంటున్న తమకు రైతు భరోసా డబ్బులు జమ కాలేదని వివరించారు. మహబూబ్ నగర్ జిల్లాలోని నవాబ్ పేట మండలం దాయబత్తులపల్లి గ్రామానికి చెందిన మురళి సర్వేనెంబర్ 54 లో వ్యవసాయం చేసుకుంటున్న అతడికి కూడా రైతు భరోసా నిధులు ఖాతాలో జమ కాకపోవడం గమనార్హం. అనేకమంది సన్నా చిన్నకారు రైతులకు కూడా రైతు భరోసా పడకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైతుల ఆధార్ కార్డుకు ఫోన్ నెంబర్ లింకు లేదని కొందరికి రైతు భరోసానిధులు జమ చేయలేదని తెలిసింది మహబూబ్నగర్ జిల్లాలో మొత్తం 2, లక్షల 54 వేల59 మంది రైతులు ఉండగా వారికి 255 . 59 కోట్ల నిధులు వారి ఖాతాలలో జమ చేయవలసి ఉండగా ఇప్పటివరకు 230.09 కోట్లు మాత్రమే వారి ఖాతాలో జమ చేసినట్లు అధికారిక లెక్కలు తెలుపుతున్నాయి. నాగర్ కర్నూలు జిల్లాలో 3,34, 835 మంది రైతులకు 429.31 కోట్ల నిధులు జమ చేయవలసి ఉండగా 394.38 కోట్లు మాత్రమే వారి ఖాతాలో జమ చేశారు వనపర్తి జిల్లాలో 1,96,683 మంది రైతులు వ్యవసాయం చేస్తుండగా వీరికి 212.11 కోట్ల నిధులు వారి ఖాతాలో జమ చేయవలసి ఉండగా 196.49 కోట్ల నిధులు మాత్రమే జమ చేశారు జోగులాంబ గద్వాల జిల్లాలో 1,83830 మంది రైతులను గుర్తించగా 271.57 కోట్ల నిధులు వారి ఖాతాలో జమ చేయవలసి ఉండగా 244.33 కోట్ల నిధులు మాత్రమే రైతు భరోసా నిధులు ఖాతాలో జమ చేశారు నారాయణపేట జిల్లాలో 1,83, 500 మంది రైతులను లబ్ధిదారులుగా చేర్చినప్పటికీ 1,79685 మంది రైతులకు మాత్రమే రైతు భరోసా నిధులు వారి ఖాతాలో జమ చేశారు. అనేకమంది లబ్ధిదారులు తమకు రైతు భరోసా అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వేలో వ్యవసాయ భూములను మూడు రకాలుగా విభజించారని దానిని ఆసరా చేసుకుని రైతు భరోసానిధులను 100% జమ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారులు ప్రకటించారు. జిల్లాలోని పలు బ్యాంకులు అధికారులు కొంతమంది రైతులు రుణమాఫీ కాని వారికి కూడా రైతులు భరోసానిధులను వారి ఖాతాలో జమ చేయలేదని తెలిసింది





## స్థానిక సంస్థల ఎన్నికలు ఏర్పాట్ల
# ప్రక్రియ వేగవంతం

**హైదరాబాద్:** తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలు ఏర్పాట్ల ప్రక్రియ వేగవంతం తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం, రాజకీయ పార్టీలు సన్నద్ధమవుతుండటంతో ఈసీ ఏర్పాట్ల ప్రక్రియను వేగవంతం చేసింది. ఓటర్ల తుది జాబితా తయారీపై దృష్టి సారించింది. పంచాయతీ ఎన్నికల కోసం కొత్త ఓటర్ల జాబితాను రూపొందిస్తున్నారు. ఈసీ ఆదేశాల మేరకు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని వార్డుల వారీగా ఓటర్ల జాబితాను అధికారులు తయారు చేస్తున్నారు. అటు రాష్ట్రంలో స్థానిక ఎన్నికలను 2 దశల్లో నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఈసీకి ప్రతిపాదించింది.

# బనకచర్లపై కేంద్రం కీలక ప్రకటన

**న్యూఢిల్లీ, జులై 28:** బనకచర్ల ప్రాజక్ట్ పనులు ఇంకా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్ట లేదని కేంద్ర జల శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ సాంకేతిక, ఆర్థిక అంచనా కోసం ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును ఇప్పటికే కేంద్ర జలసంఘానికి అందించినట్లు తెలిపారు. ఈ ప్రాజక్ట్‌పై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు లేవనెత్తుతూ... లేఖ రాసిందని గుర్తు చేశారు. ఈ ప్రాజక్ట్ సాంకేతిక – ఆర్థిక అంచనాల కోసం కేంద్రం తగిన ప్రక్రియను అనుసరిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్‌పై సంబంధిత అధికారులు, పరీవాహక ప్రాంత రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. సోమవారం రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీ నేత, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర జల శక్తి మంత్రి రాజ్ భూషణ్ లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. సముద్రంలోకి వృథాగా వెళ్లే గోదావరి మిగులు జలాలను రాయలసీమకు తరలించి.. సస్యశ్యామలం చేయాలని చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఆ క్రమంలో గోదావరిపై బనకచర్ల ప్రాజెక్టను రూ. 81,900 కోట్లతో నిర్మించాలని నిర్ణయించింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ క్రమంలో అఖిల పక్షం ఏర్పాటు చేసి.. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి వ్యతిరేకంగా తీర్మానం చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని పలువురు మంత్రులు ఢిల్లీలోని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి.. బనకచర్ల నిర్మాణాన్ని అడ్డుకోవాలని.. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల తెలంగాణకు భవిష్యత్తులో కలిగే సమస్యలను వివరించింది. దీంతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం సమర్పించిన దస్త్రాన్ని కేంద్రం జలశక్తి మంత్రిత్వ శాఖ పక్కన పెట్టింది. ఆ తర్వాత.. ఇటీవల న్యూఢిల్లీ వేదికగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన తెలుగు రాష్ట్రాల సీఎంలు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలు ఈ సందర్భంగా వీరు చర్చించారు. అనంతరం ఈ అంశంపై నిపుణులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలంటూ ఈ భేటీలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి ఇరు రాష్ట్రాల భారీ నీటి పారుదల శాఖ మంత్రులతోపాటు వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.



వార్తాతరంగాలు

మంగళవారం 29 జూలై 2025

# సంపాదకీయం

## అరకోటి మంది ఓటర్లెక్కడ?

బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా నవీకరణ సుప్రీంకోర్టులో విచారణ దశలోనే వున్నా, పార్లమెంటులో అలజడి రేగుతున్నాఆ ప్రక్రియ తన దోవన తాను ముందుకెళు న్నది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ గురువారం ఆ వ్యవహారం గురించి వెల్లడించిన వివరాల ప్రకారం, లక్షమందికి పైగా ఓటర్ల ఆచూకీ లేదు. 21.6 లక్షల మంది మరణించారు. మరో 31.5 లక్షల మంది శాశ్వతంగా వేరే చోటుకు వలసపోయారు. పోలింగ్ కేంద్రం స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) అడుగుతున్నా, మరో ఏడు లక్షల మంది ఇంతవరకూ తమ పత్రాలు దాఖలు చేయలేదు. తాము ఫలానా చోట ఉంటు న్నామని రుజువులు చూపక పోయినా, బతికే ఉన్నామని చెప్పకపోయినా లేదా తగిన పత్రాలుఅందజేయక పోయినా ఈ 61 లక్షల మంది ఓటర్లు జాబితా నుంచి శాశ్వతంగా కనుమరుగవుతారు. రాష్ట్ర ఓటర్లలో వీరు 7.7 శాతం. శు క్రవారం సాయంత్రంతో వీరందరికీ గడువు ముగిసిపోయింది. సవరించిన ఓటర్ల జాబితా ఆగస్టు 1న విడుదలవుతుంది. అయితే సెప్టెంబర్ 1లోగా ఎవరైనా జాబితాలో తమ పేరు లేదని ఫిర్యాదు చేస్తే పరిశీలించి, తగిన పత్రాలున్న పక్షంలో వారిని చేర్చి తుది జాబితా విడుదల చేస్తారు. నకిలీ లేదా విదేశీయులుగా గుర్తించిన వారిని తొలగించటం కోసం ప్రారంభించిన ఈ ప్రక్రియ దేశ చరిత్రలోనే మొట్టమొదటిది. 'పరిశుద్ధమైన' ఓటర్ల జాబితా రూప కల్పనే తమ లక్ష్యమని జ్ఞానేశ్ చెబుతున్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ స్వచ్ఛతా కార్యక్రమాన్ని స్వాగతించాల్సిందే. ఎందుకంటే ప్రజాస్వామ్య వ్యవస్థ సక్రమంగా నడవాలంటే మెజారిటీ ఆమోదం పొందిన ప్రభుత్వాలు ఏర్పడాలి. ప్రజల ఆదరణ ఉన్నవారే పాలకులు కావాలి. నకిలీ ఓటర్లు లేదా ఈ దేశ పౌరులు కానివారు ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే స్థితి ఉంటే ఆ ఎన్నికలే ప్రహసన ప్రాయమవుతాయి. ఎన్నికలు సజావుగా పూర్తవుతున్నాయన్న భావన వల్లే ఫలితాలు వెలువడ్డాక అధికార మార్పిడి శాంతియుతంగా పూర్తవుతోంది. గత దశాబ్దాలతో పోలిస్తే ఎన్నికల హింస గణనీయంగా తగ్గింది. ఇలాంటి కారణాల వల్లే విదేశాల ఎన్నికలకు మన ఈసీ అధికారులు పరిశీలకులుగా వెళ్తున్నారు. వారు సూచిస్తున్న మార్పులకు ఎంతో విలువ ఉంటున్నది. కానీ గత ఏడాది, రెండేళ్లుగా ఈసీ వ్యవహార శైలిపై విమర్శలూ, ఆరోపణలూ వెల్లువెత్తు తున్నాయి. వాటిపై అసలే స్పందించకపోవటం లేదా మరిన్ని సందేహాలు కలిగే రీతిలో జవాబీ యటం రాజకీయ పక్షాలకు ఆశ్చర్యం కలిగిస్తోంది. బిహార్ ఎన్నికల జాబితా సంగతే తీసుకుంటే సుప్రీంకోర్టు సూచించిన ఆధార్, రేషన్ కార్డు వగైరాలు పరిశీలనకు పనికి రావని అది ఎందుకు తిరస్కరించిందో అంతుపట్టదు. ఆధార్‌ను ప్రారంభించినప్పుడు నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆ కార్డే ఇకపై సర్వస్వమని, దాని ఆధారంగానే పథకాల వర్తింపు అయినా, పౌరుల గుర్తింపయినాఉంటుందన్నారు. కానీ జరుగుతున్నది అందుకు విరుద్ధం. మరి విశ్వసనీయత లేని ఆధార్‌ను అన్నిటికీ అనుసంధానం చేయటం ఎందుకు? ఇప్పటికీ ఆ కార్డు సంపాదించటానికి సాధారణ పౌరులు తలకిందులవుతున్నారు. పుట్టిన చోటే నవజాత శిశువులకు ఆధార్ అందేలా తాజాగా కేంద్రం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అటువంటి కార్డు ఓటరు గుర్తింపునకు పనికిరాదని ఈసీ ఎలా చెబుతుందో అర్థంకాని విషయం. పౌరుల్ని గుర్తించటమనే ప్రక్రియ అన్యులకు అసాధ్యమని, కేవలం తామే సమర్థులమని ఆ సంస్థ చెప్పదల్చుకుంటే దాన్నెవరూ అంగీకరించరు. ఎన్నికల విశ్వసనీయతపై సందేహాలు తలెత్తటంపై ఆంధ్రప్రదేశ్ మొదలుకొని మహారాష్ట్ర, హరియాణాల వరకూ ఎన్ని ఉదాహరణలైనా చూపొచ్చు. ఏపీ సంగతే తీసుకుంటే... అక్కడ ఓటింగ్‌కు గడువు ముగిసి కేవలం ప్రాంగణంలో ఉన్న వారితో పోలింగ్ పూర్తి చేయటానికి అర్ధరాత్రి వరకూ సమయం పట్టింది. అలా వేచివున్నవారి సంఖ్య ఏకంగా 51 లక్షలు! ఇది నమ్మేలా ఉందా? ఇక పోలింగ్ శాతంపై మొదటి, చివరి ఈసీ ప్రకటనల్లోని అంకెల మధ్య 12.5 శాతం తేడావచ్చింది. ఇది గతంలో ఎప్పుడూ ఒక శాతం మించిలేదు. ఇందువల్ల సగటున ఒక్కో అసెంబ్లీ స్థానంలో అదనంగా 28,000 ఓట్లు, లోక్‌సభ స్థానంలో 1.96 లక్షల ఓట్లు అమాంతం పెరిగి పోయాయి. తటస్థ సంస్థల లెక్కల ప్రకారం ఇది 87 అసెంబ్లీ స్థానాల గెలుపోటముల్ని తారుమారు చేసింది! వేరే రాష్ట్రాల్లోనూ ఇలాంటి ధోరణే కనబడిందని అక్కడి విపక్షాలు భగ్గుమంటున్నాయి. ఈ సందేహాలకు సక్రమమైన జవాబు చెబితే బిహార్‌లో చేపట్టిన 'సర్'పై పెద్దగా అభ్యంతరాలు వచ్చేవి కాదేమో! కానీ ఆ సంస్థ తనకు తోచినప్పుడు మాట్లాడటం తప్ప జవాబుదారీతనాన్నీ, బాధ్యతాయుత వర్తననూ కనబరచటం లేదు. సందేహాలు పటాపంచలు చేద్దామన్న పట్టుదలను ప్రదర్శించటం లేదు. ఈసీ న్యాయబద్ధంగానే వ్యవహరిస్తున్నాననుకోవచ్చు. కానీ అలా అందరూ అనుకునేలా తన వ్యవహార శైలి వుండాలి. ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థకైనా ఇది తప్పనిసరి. అందునా ప్రభుత్వాల తలరాతలను మార్చే కీలకమైన వ్యవస్థగా ఉన్న ఈసీకి ఇది మరింత ప్రాణప్రదం. దేశంలో ఉత్తరప్రదేశ్, బిహార్‌ల నుంచి వలసలు ఎక్కువుంటాయి. అలాంటిచోటఇంత తక్కువ వ్యవధిలో ఎక్కడెక్కడినుంచో పనులు మానుకుని వచ్చి ఓటర్లుగా నమోదు చేసు కోవటానికి అవసరమైన పత్రాలు సేకరించి సమర్పించటం బడుగు జీవులకు సాధ్యమేనా? అందుకే సర్వోన్నత న్యాయస్థానం సూచించిన ఇతర ప్రత్యామ్నాయాల గురించి కూడా ఈసీ పరిశీలించాలి. ఈ మాదిరి సవరణకు దేశవ్యాప్త ఆదరణ లభించాలంటే ఇది తప్పనిసరి.

# నేడు డాక్టర్ సి నారాయణ రెడ్డి జయంతి

**నన్ను దోచుకుందువటే వన్నెల దొరసానీ**

**మన తెలంగాణ ముద్దు బిడ్డ, జ్ఞాన పీఠ అవార్డు గ్రహిత**



తెలుగు చలన చిత్ర సీమలో డాక్టర్ సి.నారాయణరెడ్డి సాహిత్యం సహజత్వానికి ప్రయోగాలకు పుట్టినిల్లు. అంతకు మునుపు ఎక్కువగా వాడని పదాలను సాహితీ స్రవంతిలోకి తీసుకు వచ్చి, వాటితో సాహిత్యానికి ఎంతో వన్నె తెచ్చారు సినారె. దొరసాని, నెరజాణ వంటి పదాలు అప్పట్లో తెలుగు సినీ సాహిత్యంలో చాలా అరుదుగా ఉపయోగించే వారు. నారాయణ రెడ్డి అటువంటి పదాలను తన సాహిత్యంలో పొందు పరచి తెలుగు భాష అందాన్ని పెంచారు. సినారెగా సుప్రసిద్ధుడైన డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డిది ఒకప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇప్పుడు రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని హనుమాజీపేట. బుచ్చమ్మ, మల్లారెడ్డి తల్లిదండ్రులు. 1931 జూలై 29న జన్మించారు. ప్రాథమిక విద్యను స్వగ్రామంతో పాటు సిరిసిల్ల,కరీంనగర్‌లో పూర్తి చేశారు. ఉన్నత విద్యాభ్యాసానికి హైదరాబాద్ వెళ్లారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ పూర్తి చేసి అక్కడే అధ్యాపకుడిగా పనిచేశారు. కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడే శోభ పత్రికకు సంపాదకుడిగా వ్యవహరించారు. పసి వయసులో విన్న హరికథలు, జానపదాలు, జంగం కథల స్ఫూర్తితో ఉన్నత స్థాయి సాహితీవేత్తగా ప్రఖ్యాతి చెందారు. 1953లో నవ్వనిపువ్వుతో ప్రారంభమైన సినారె సాహిత్య ప్రస్థానం అలుపెరగక సాగిపోయింది. పద్య కవితలు, గేయకావ్యాలు, వచన కవితలు, గద్య కృతులు, సంగీత నృత్య రూపకాలు, ముక్తకాలు, బుర్ర కథలు, గజళ్లు, వ్యాసాలు విమర్శలు, అనువాదాలు వంటి అనేక సాహితీ ప్రక్రియల్లో అనితర సాధ్యమైన ప్రతిభను చాటుకున్నారు. నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, మట్టి మనిషి ఆకాశం, విశ్వంభర, మంటలు మానవుడు, మధ్య తరగతి మందహాసం, నడక నా తల్లి, తెలుగు గజళ్లు, భూమిక, ముఖాముఖి, ఆరోహణ, అక్షర గవాక్షాలు, ఇంటి పేరు చైతన్యం తదితర రచనలు చేశారు. సినారె రాసిన రామప్ప సంగీత నృత్య రూపకం అన్ని భారతీయ భాషల్లోకి అనువదించబడింది. దీంతో పాటు ఆయన గ్రంథాలు ఇంగ్లిష్, ఫ్రెంచ్ సంస్కృతం, మలయాళం, హిందీ, ఉర్దూ కన్నడ భాషల్లోకి అనువాదమయ్యాయి. అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్, రష్యా, జపాన్, కెనడా, ఇటలీ, డెన్మార్క్, థాయ్‌లాండ్, సింగపూర్, మలేషియా వంటి దేశాల్లో సందర్శించారు. అంతర్జాతీయ కవి సమ్మేళనాల్లో భారతీయ ప్రతినిధిగా హాజరై తెలుగు సాహిత్య వైభవాన్ని విశ్వయవనికపై చాటారు. ఆధునిక ఆంధ్ర కవిత్వం, సంప్రదాయాలు, ప్రయోగాలు పేరిట సినారె పరిశోధన ఆయను పీహెచ్‌డీ ప్రామాణిక విమర్శన గ్రంథంగా మిగిలింది.

**అత్యున్నత పురస్కారాలు..**

కేంద్ర సాహిత్య అకాడమీ, సోవియట్ ల్యాండ్ నెహ్రు పురస్కారంతో పాటు విశ్వంభర దీర్ఘ కావ్యానికి 1988లో ప్రతిష్టాత్మక జ్ఞానపీఠ పురస్కారం వరించింది.భారతీయ భాషా పరిషత్, రాజలక్ష్మి, అసాన్, ఉమ్మడి రాష్ట్రంలో సాంస్కృతిక వ్యవహారాలు సలహాదారునిగా, సాంస్కృతిక మండలి, అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా, సార్వత్రిక విశ్వవిద్యాలయం, తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతిగా వ్యవహరించారు. తెలుగు విశ్వవిద్యాలయం నుంచి విశిష్ట సాహిత్య పురస్కారం అందుకున్నారు. డాక్టర్ బోయి భీమన్న జీవన సాఫల్య పురస్కారం స్వీకరించారు. రాజ్యసభ సభ్యులుగా ఉన్నతమైన బాధ్యతలను నిర్వహించారు. భారత ప్రభుత్వం సినారె సేవలను గుర్తించి పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలిచ్చింది. పలు విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్‌తో గౌరవించాయి.సినిమా పాటలు కైకట్టి..వందలాది సినిమాలకు వేల సంఖ్యలో సినీ గీతాలు రాశారు. స్వర్గీయ ఎన్టీఆర్ కథానాయకుడిగా విడుదలైన గులేబకావళి కథ సినిమాలో నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని అనే పాటతో సినీ రంగ ప్రవేశం చేసిన సినారె ఆపైన సుమారు మూడు వేలకు పైగా పాటలు రచించి సినిమా ప్రేక్షకులకు సైతం చేరువయ్యారు. చిలిపి కనుల తీయని చెలికాడా..అనగనగా ఒక రాజు అనగనగా ఒక రాణి, నీ ధర్మం నీ సంఘం నీ దేశం నువు మరవొద్దు, జాతిని నీతిని నిలిపిన మహనీయులనే మరవొద్దు. అమ్మను మించి దైవం ఉన్నదా ఆత్మను మించి అద్దమున్నదా.. కంటేనే అమ్మ అని అంటే ఎలా.. ఓ ముత్యాల కొమ్మా...ఓ రాములమ్మా.. తదితర తెలుగు సినిమా పాటలు సినారె ప్రతిభకు తార్కాణాలు. సినిమా పాటల్లో సైతం సాహిత్య విలువలకు పట్టం కట్టి తెలుగు సినీ సాహిత్యంపై చెరగని ముద్ర వేశారు. 2017 జూన్ 12 న హైదరాబాద్ కేర్ ఆస్పత్రిలో అనారోగ్యంతో కన్ను మూశారు.

# 5 రోజుల్లో లక్ష కోట్లకు పైగా సంపద ఆవిరి

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకొని ఉంటాయి. ఏ స్టాక్ ఎప్పుడు పెరుగుతుందో ముందుగానే మనం ఊహించలేం. మార్కెట్లపై సరైన అవగాహన ఉన్నప్పుడే.. ఆయా కంపెనీల నుంచి వచ్చే ప్రకటనలు, ప్రణాళికలు, పెట్టుబడి వ్యూహాలు, ఫలితాలు ఇలా ఇవన్నీ స్టాక్ గమనంతో పాటు స్టాక్ మార్కెట్ గమనాన్ని కూడా నిర్దేశిస్తుంటాయి. అందుకే జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. ఇంకా సరైన సమయంలో సరైన కంపెనీ స్టాక్‌ను నిపుణుల సలహాతో ఎంచుకోవాలి. ఇదే సమయంలో షార్ట్ టర్మ్‌లోనే లాభాలు రావాలని కూర్చోవద్దు. ఓపిక ఉండాలి. దీర్ఘ కాలంలోనే బంపర్ రిటర్న్స్ వస్తుంటాయని నిపుణులు ఎప్పుడూ చెబుతుంటారు.అయితే గత కొంత కాలంగా దేశీయ స్టాక్ మార్కెట్లు నేలచూపులు చూస్తున్నాయి. గత వారం షేర్ మార్కెట్లో గణనీయమైన హెచ్చుతగ్గులు నమోదయ్యాయి. ముఖ్యంగా సెన్సెక్స్ టాప్-10 జాబితాలోని పలు కంపెనీల పెట్టుబడిదారులు నష్టాలను చవిచూశారు. మార్కెట్ విలువ పరంగా దేశంలోనే అతిపెద్ద సంస్థ అయిన ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు టాటా గ్రూప్‌కు చెందిన టీసీఎస్, ఎల్ఐసీ వంటి సంస్థలకు గత వారం నిరాశజనకంగా ముగిసింది. అయితే ఈ పతనంలో రిలయన్స్ పెట్టుబడిదారులు అతిపెద్ద షాక్‌ను చవిచూశారు. కేవలం 5 పని దినాల్లో వారి సంపద రూ.లక్ష కోట్లకు పైగా తగ్గింది.వరుస సెషన్లలో పతనం దిశగానే సాగుతున్నాయి. ఇన్వెస్టర్లు తీవ్ర ఒత్తిడితో ఆయా షేర్లను విక్రయిస్తుండటం కారణంగా స్టాక్స్ పడిపోతుండటంతో పాటు వారు కూడా నష్టాల్ని ఎదుర్కొంటున్నారు. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు, కార్పొరేట్ కంపెనీల బలహీనమైన త్రైమాసిక ఫలితాలకు తోడు.. యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ కఠిన నిర్ణయాలు ఇందుకు కారణంగా నిలుస్తున్నాయి.ఇక గత వారం కూడా సూచీలు భారీగానే పడిపోయాయి. బీఎస్ఈ



బెంచ్‌మార్క్ ఇండెక్స్ బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ సెన్సెక్స్ 294.64 పాయింట్లు పడిపోయింది. ఈ క్రమంలోనే చాలా స్టాక్స్ పడిపోగా.. దేశంలో మార్కెట్ విలువ పరంగా టాప్-10 కంపెనీల్లో 6 కంపెనీల విలువనే ఏకంగా రూ. 2.22 లక్షల కోట్లు తగ్గడం గమనార్హం. ఇందులో దిగ్గజ పారిశ్రామిక వేత్త ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ టాప్‌లో ఉంది. రిలయన్స్ సంస్థ ఎం- క్యాప్ 5 రోజుల వ్యవధిలో ఏకంగా రూ. 1.14 లక్షల కోట్లు తగ్గగా ఇప్పుడు అది రూ. 18.83 లక్షల కోట్లకు దిగొచ్చింది.ఆ తర్వాత ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ఉంది. ఇన్ఫీ మార్కెట్ విలువ గత వారం రూ. 29 వేల కోట్లకుపైగా తగ్గగా ప్రస్తుతం ఎం - క్యాప్ రూ. 6.29 లక్షల కోట్లుగా ఉంది. ఇదే సమయంలో ఎల్ఐసీ మార్కెట్ విలువ రూ. రూ. 23 వేల కోట్ల పతనంతో రూ. 5.60 లక్షల కోట్లకు దిగొచ్చింది. ఇక టీసీఎస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 20 వేల కోట్లు తగ్గి రూ. 11.34 లక్షల కోట్లకు పడిపోయింది. బజాజ్ ఫినాన్స్ ఎం క్యాప్ రూ. 17 వేల కోట్లు తగ్గింది. హిందుస్థాన్ యూనిలివర్ మార్కెట్ విలువ రూ. 17 వేల కోట్లు పడిపోయింది.వీటికి భిన్నంగా మరో 4 కంపెనీల విలువ అమాంతం పెరిగింది. ఫలితాల్లో ఈ కంపెనీలు అంచనాల్ని మించగా.. షేర్లు పెరిగాయి. ఇందులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ టాప్‌లో నిలిచింది. ఈ బ్యాంక్ మార్కెట్ విలువ రూ. 37 వేల కోట్లు పెరిగి రూ. 15.38 లక్షల కోట్లకు ఎగబాకింది. ఐసీఐసీఐ బ్యాంకు ఎం క్యాప్ రూ. 35 వేల కోట్లు పెరగడంతో రూ. 10.53 లక్షల కోట్లుగా ఉంది. భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ రూ. 20 వేల కోట్లు పెరిగి రూ. 11.04 లక్షల కోట్ల వద్ద ఉంది. అంతకుముందు వారం ఇది మార్కెట్ విలువలో టీసీఎస్‌ను మించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మళ్లీ తగ్గింది. ఎస్బీఐ ఎం - క్యాప్ రూ. 9 వేల కోట్లు పెరిగి రూ. 7.44 లక్షల కోట్లకు చేరింది.స్టాక్ మార్కెట్ లో వచ్చిన పతనం కారణంగా బే స్టాక్ ఎక్స్ఛేంజ్‌ని 30 షేర్ల సెన్సెక్స్ 294.64 పాయింట్ల నష్టాన్ని నమోదు చేసింది. ఈ పరిణామంలో సెన్సెక్స్ టాప్-10లో 6 కంపెనీల మార్కెట్ క్యాప్ సంయుక్తంగా రూ.2.22 లక్షల కోట్ల భారీ పతనాన్ని చవిచూసింది. ఈ జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎల్ఐసీ వంటి దిగ్గజ సంస్థలు ఉన్నాయి. అయితే ఈ పతనంలో కూడా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ సహా నాలుగు సెన్సెక్స్ కంపెనీల మార్కెట్ విలువ పెరిగి పెట్టుబడిదారులకు ఊరటనిచ్చింది.గత కొన్ని వారాలుగా దేశంలోనే అత్యంత ధనవంతుడైన ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ మార్కెట్ క్యాప్ తగ్గినప్పటికీ ఇది ఇప్పటికీ దేశంలో అత్యంత విలువైన కంపనీల జాబితాలో నంబర్ 1 స్థానంలో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. దీని తర్వాత వరుసగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐ, ఇన్ఫోసిస్ , బజాజ్ ఫైనాన్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎల్ఐసీ ఉన్నాయి. మార్కెట్ ఒడిదుడుకులు ఉన్నప్పటికీ రిలయన్స్ తన స్థానాన్ని నిలబెట్టుకోవడం విశేషం.

# ఇక సైనికులకు బాడీ కెమెరాలు

**శ్రీనగర్, జూలై 28:**సరిహద్దుల్లో చొరబాటుదారుల ఆగడాలకు కేంద్రం టెక్నాలజీతో చెక్ పెట్టబోతోంది. జవాన్లకు బాడీ కెమెరాలు అందజేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. భారత్ సరిహద్దుల్లోకి వచ్చిన అక్రమ చొరబాటుదారులను వెనక్కి పంపించే క్రమంలో సాయుధ బలగాలపైనే తిరగబడుతూ దాడులు చేస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తున్న సరిహద్దు బలగాలు.. ఇటువంటి ఘటనలను ఆధారాలతో సహా చిత్రీకరించేందుకు ప్రయత్నాలు చేస్తుంది. దాంతో.. బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ కార్యకలాపాలను మరింత మెరుగుపరిచేందుకు అధునాతన బాడీ-వోర్న్ కెమెరాలను సమకూర్చుకుంటోంది. ఈ కెమెరాలు జవాన్ల యూనిఫామ్‌లకు అమర్చబడి, సరిహద్దుల్లో జరిగే ప్రతి అంశాన్ని రికార్డు చేస్తాయి. దానిలో భాగంగానే.. భారత్-బంగ్లాదేశ్, పాక్ అంతర్జాతీయ సరిహద్దుల్లోని బీఎస్ఎఫ్ జవాన్లకు 5వేలకు పైగా శరీరానికి ధరించే కెమెరాలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది.ముఖ్యంగా.. బంగ్లాదేశ్, పాక్ సరిహద్దుల వెంట విధులు నిర్వర్తిస్తున్న %దీూఖీ% దళాలకు ఆయా బాడీ కెమెరాలను అందించనుంది. ఇప్పటికే 2,500 కెమెరాలను పంపిణీ చేయగా, మరో 2,500 కెమెరాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. వీటితోపాటు ఎంపిక చేసిన సరిహద్దు ఔట్ పోస్టుల్లోని సిబ్బందికి ఫింగర్‌ప్రింట్, ఐరిస్ స్కాన్ వంటి బయోమెట్రిక్ పరికరాలను అందించనున్నట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారుల నుంచి సేకరించిన ఈ సమాచారాన్ని ఫారినర్స్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు అందజేయనుంది.బీఎస్ఎఫ్ ప్రతిపాదించిన ఈ రెండు విధానపర నిర్ణయాలపై సమగ్ర సమీక్ష తర్వాత కేంద్ర హోంశాఖ ఇటీవల ఆమోదం తెలిపినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే.. రెండు దశల్లో వీటిని భారత్-



బంగ్లా సరిహద్దులో విధులు నిర్వర్తిస్తున్న బీఎస్ఎఫ్‌కు అందజేస్తుంది. రాత్రిపూట చిత్రీకరణ, 12-14 గంటల ఫుటేజీ నిక్షిప్తం చేసుకునే సామర్థ్యం ఈ కెమెరాలకు ఉండనుంది.

# యాదగిరిగుట్ట దేవస్థానం లో..ప్రక్షాళనకు పది కమిటీలు

**నిర్వహణ లోపాల నివారణే కమిటీల ధ్యేయం**

**యాదగిరిగుట్ట, జూలై 28:**తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం పాలన కొత్త పుంతలు తొక్కుతోంది. పాలనలో పారదర్శకత లోపాల నివారణ కోసం ప్రక్షాళనకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్ వెంకట్రావు ప్రక్షాళన చర్యలు చేపట్టారు. భక్తులకు మెరుగైన%తీ% సౌకర్యాలు దర్శనాలు కల్పించేందుకు పది కమిటీలను నియమించారు. పాలనాపరంగా నిర్వహణలో అన్ని విభాగాలలో పారదర్శకత పాటించేందుకు లోపాలను నివారించేందుకు అంతర్గతంగా ఆడిటు చేసుకునేందుకు అదేవిధంగా భక్తులు స్థానికుల నుండి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా చూసేందుకు కమిటీలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు దేవస్థానంలోని అన్ని విభాగాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తమ దృష్టికి వచ్చిన లోపాలను సూచనలను దేవస్థానం కార్యనిర్వహణాధికారి దృష్టికి తీసుకువచ్చే విధంగా ఈ కమిటీలు పరిచారని నిర్ణయించారు దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఈ పది కమిటీలకు చైర్మన్గా వ్యవహరిస్తారు దేవస్థానం అధికారులు సిబ్బందిని సభ్యులుగా నియమిస్తూ కమిటీలను ఏర్పాటు చేశారు

**పది కమిటీలు ఇవే....**

1) దేవాలయం, ప్రసాదాలు, అన్నదానం పర్యవేక్షణ కమిటీ .2) క్రౌడ్ మేనేజ్మెంట్ కమిటీ. 3) సేఫ్టీ అండ్ సెక్యూరిటీ ఓవర్ సైట్ కమిటీ. 4) పారిశుద్ధ్యం, పరిశుభ్రత పర్యవేక్షణ కమిటీ. 5) విద్యుత్ ,సీసీ కెమెరాలు, వైర్లెస్ వ్యవస్థ, బ్యాటరీ వాహనాలు, ఏసీలు, లిఫ్టుల పర్యవేక్షణ కమిటీ. 6) వసతి సౌకర్యాల పర్యవేక్షణ కమిటీ .7) విద్యాసంస్థల పర్యవేక్షణ కమిటీ. 8) రెవెన్యూ యాజమాన్య కమిటీ .9) లీజులు, కిరాయి యాజమాన్య కమిటీ.10) అకౌంట్స్ మేనేజ్మెంట్ కమిటీ.

# ఇందిరమ్మ ఇంటికి రుణాలు

**ఖమ్మం, జూలై 28:** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. పునాది నిర్మాణానికి ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ మేరకు డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు అందిస్తున్నారు. లబ్ధిదారులు రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు రుణం పొంది నిర్మాణం ప్రారంభించవచ్చు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 1.74 లక్షల మంది పనులు మొదలుపెట్టారు. ఖమ్మం జిల్లాలో 1,900 మందికి పైగా రూ.22.83 కోట్ల రుణాలు మంజూరు కాగా, ఆగస్టు నెలాఖరుకు మరిన్ని జిల్లాల్లో రుణాలు మంజూరు చేయనున్నారు.తెలంగాణ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నారు. అయితే ముందు లబ్ధిదారులు ఖర్చు పెట్టుకుంటే ఇంటి నిర్మాణం జరిగే వివిధ దశల్లో మొత్తం 4 విడతలుగా రూ.5 లక్షల సాయం అందిస్తారు. అయితే ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల్లో చాలామంది ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. పునాది స్థాయి వరకు నిర్మాణం పూర్తయితేనే మొదటి విడతగా రూ.లక్ష సాయం ప్రభుత్వం నుండి అందుతాయి. ఈ దశను చేరుకోవడానికి కూడా డబ్బులు లేక కొందరు నిరుపేదలు మంజూరు పత్రాలను వెనక్కి ఇచ్చే పరిస్థితి ఏర్పడింది.ఈ నేపథ్యంలో సర్కార్ తీపి కబురు చెప్పింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ నిరుపేద లబ్ధిదారులకు డ్వాక్రా స్వయం




సహాయక సంఘాల ద్వారా రుణాలు ఇస్తున్నారు. ఇల్లు కట్టుకోవడానికి రూ. 1 లక్ష వరకు రుణం మంజూరు చేస్తున్నారు. ఈ రుణ సాయం రాష్ట్రంలోని పలు చోట్ల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఊతమిస్తోంది. రాష్ట్రంలో గ్రేటర్ హైదరాబాద్ మినహా మొత్తం 3.68 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారు. ఇందులో ఇప్పటికే 1.74 లక్షల మంది లబ్ధిదారులు నిర్మాణ పనులు ప్రారంభించారు. తొలి విడత బిల్లు పొందడానికి కూడా ఆర్థిక స్థోమత లేని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ, సీఐఎఫ్, స్త్రీనిధి ద్వారా ఇంటి నిర్మాణానికి రూ. 1 లక్ష వరకు రుణం పొందవచ్చు. చెల్లించే సామర్థ్యం ఉన్నవారికి రూ. 2 లక్షలు వరకు కూడా రుణాలు మంజూరు చేస్తున్నారు.ఈ రుణాలు పొందిన కొందరు లబ్ధిదారులు, పునాది దశ దాటి మొదటి బిల్లు అందుకున్న తర్వాత రుణభారాన్ని తగ్గించుకుంటున్నారు. చాలామంది 12 నుండి 24 వాయిదాల్లో రుణం చెల్లించడానికి ఆసక్తి చూపుతున్నారు. సంఘాల్లో పాత అప్పులు లేనివారు, డిఫాల్టర్లు కాని వారికి మాత్రమే బ్యాంకులు ఈ రుణాలు అందిస్తాయి. ఖమ్మం జిల్లాలో మొత్తం 12,038 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఉండగా, రూ. 1 లక్ష రుణం పొందేందుకు 7,287 మంది అర్హులుగా గుర్తించబడ్డారు. వీరిలో ఇప్పటికే 1,900 మందికి పైగా లబ్ధిదారులకు రూ. 22.83 కోట్లను రుణంగా అందించారు. మిగిలిన వారికి ఆగస్టు నెలాఖరు వరకు రుణాలు అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గంలో 551 మందికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిరలో 351 మందికి డ్వాక్రా రుణాలు అందజేశారు.జిల్లాలో మొత్తం 8,252 మంది లబ్ధిదారులు ఉండగా, రూ. 1 లక్ష రుణానికి 4 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 466 మందికి రుణం ఇవ్వాలని గుర్తించారు. వనపర్తి, నారాయణపేట జిల్లాలలో కూడా పలువురికి రుణాల మంజూరుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ రుణ పథకం నిరుపేద లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవడానికి ఒక గొప్ప అవకాశాన్ని కల్పిస్తోంది, తద్వారా రాష్ట్రంలో గృహ నిర్మాణ లక్ష్యాలను చేరుకోవడానికి సహాయపడుతుంది.

## ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం..

**ఆదాయం కోసం మద్యం అమ్మకాలనే నమ్ముకున్నప్రభుత్వం**

**మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**





**హైదరాబాద్ జూలై 28:** ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం అంటూ.. మేజర్ పంచాయతీల వరకే పరిమితమైన మద్యం దుకాణాలను పల్లెలకు విస్తరించాలన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. గతంలో మద్యం అమ్మకాలపై విమర్శలు చేసిన హస్తం పార్టీ, అధికారం దక్కించుకున్న తర్వాత ఆదాయం కోసం మద్యం అమ్మకాలనే నమ్ముకున్నదని ధ్వజమెత్తారు. నాగు ప్రగతి బాట పట్టిన తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని విమర్శించారు. మద్యం ప్రియుల బలహీనతను రాష్ట్ర ఖజానాకు ఆదాయ వనరుగా మార్చుకునేందుకు కుట్ర పన్నుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.'నాడు కేసీఆర్ పాలనలో పల్లె, పల్లెకు ప్రగతి రథచక్రాలు. ప్రతి చేనుకు నీళ్లు.. ప్రతి చేతికి పని. ఇంటింటికి తాగునీళ్లు.. ఆడబిడ్డలకు తప్పిన ఇబ్బందులు. నాడు ప్రగతిబాట పట్టిన తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని నిందలు. నేడు పల్లె, పల్లెలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం ప్రియుల బలహీనతను రాష్ట్ర ఖజానాకు ఆదాయ వనరుగా మార్చుకునే కుట్ర. అన్ని రంగాలలో తెలంగాణ ప్రగతిని దెబ్బతీసి .. ఇప్పుడు తీరిగ్గా ఆదాయం కోసం మద్యం అమ్మకాలను నమ్ముకున్న అసమర్థ కాంగ్రెస్ సర్కార్.ఏడాది క్రితం సగటున ఒక వ్యక్తి మద్యం కోసం చేసే ఖర్చు రూ.897. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో సగటున ఒక వ్యక్తి మద్యం మీద చేస్తున్న ఖర్చు రూ.1623కు పెరిగింది. లైసెన్స్ గడువు మూడేళ్లకు పెంచి, ధరఖాస్తు ధర రూ.3 లక్షలకు పెంచాలని నిర్ణయం. నాడు మద్యం అమ్మకాలపై విమర్శలు, నేడు అధికారం దక్కించుకుని ఆదాయం కోసం మద్యం అమ్మకాలనే నమ్ముకున్న కాంగ్రెస్ సర్కార్. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం. పాలన గాలికి.. ప్రగతి కాటికి' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## అమరావతి కొత్త ఆలోచనలతో, అధునిక వసతులతో నిర్మాణం అవుతున్న కొత్తనగరం..

**బిడదారి ఎస్టేట్ లో రెండు గంటల పాటు సీఎం చంద్రబాబు పర్యటన**

**కొన్ని ఘటనల కారణంగా సింగపూర్ - ఏపీ ప్రభుత్వాల మద్య కొన్ని సమస్యలు**

**సీఎం చంద్రబాబు నాయుడు**




**సింగపూర్:** సింగపూర్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు రెండో రోజు పర్యటన కొనసాగింది. సింగపూర్ లో 10 వేల కటుంబాలు నివాసం ఉండే బిడదారి ఎస్టేట్ లో రెండు గంటల పాటు కాలి నడకన అయన పర్యటించారు. సిటీ ఇన్ ఎ గార్డెన్ పేరుతో ఏర్పాటైన హౌసింగ్ ప్రాజెక్ట్ విశిష్టతలను ముఖ్యమంత్రికి సింగపూర్ అధికారులు వివరించారు. బిడదారీ హౌసింగ్ ప్రాజెక్టును సింగపూర్ హౌసింగ్ డెవలప్మెంట్ బోర్డు తీర్చిదిద్దింది. పట్టణ, నగర ప్రాంతాల్లో అందుబాటు ధరలో నాణ్యమైన నివాస గృహాల నిర్మాణంపై చర్చ జరిపారు. 250 ఎకరాల్లో విస్తరించిన సింగపూర్ ప్రభుత్వ హౌసింగ్ ప్రాజెక్టును సీఎం బృందం సందర్శించింది. 10 వేల కుటుంబాలు నివాసం ఉండేలా అన్ని వసతులతో పర్యావరణ హితంగా నివాస సముదాయాన్ని సింగపూర్ ప్రభుత్వం నిర్మించింది. శ్మశాన ప్రాంతాన్ని సుందరమైన పార్క్ గా సింగపూర్ అర్బన్ రీడెవల్పమెంట్ అథారిటీ మార్చింది. అర్బన్ హౌస్ ప్లానింగ్ లో భాగంగా బిడదారి ఎస్టేట్ లో సీఎం బృందం పర్యటించింది. చెట్లు తొలగించకుండా, సహజ నీటి వనరులు దెబ్బతినకుండా నిర్మాణాలు చేపట్టిన విధానాన్ని సింగపూర్ అధికారులు వివరించారు.తరువాత సింగపూర్ హౌసింగ్ డెవలప్మెంట్ బోర్డు, సింగపూర్ అర్బన్ రీడెవలప్మెంట్ అథారిటీ, సింగపూర్ కార్పోరేషన్ ఎంటర్ ప్రైజ్ సహా ప్రపంచ బ్యాంకు అధికారులతో సీఎం బృందం సమావేశమయింది. రాజధాని అమరావతి నిర్మాణంలో అనుసరిస్తున్న విధానాలు, ఆలోచనలు, ప్రణాళికలను వారితో సీఎం బృందం పంచుకుంది. ఏపీలో చేపట్టనున్న అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టుల్లో సింగపూర్ సహకారంపై సమావేశంలో చర్చ జరిగింది. బిడదారి ప్రాజెక్ట్ ను రూపొందించిన విధానం చాలా గొప్పగా ఉందని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. పర్యావరణం దెబ్బతినకుండా చేపట్టిన అర్బన్ ప్రాజెక్టు అద్భుతంగా ఉంది. అమరావతి అనేది కొత్త ఆలోచనలతో, అధునిక వసతులతో నిర్మాణం అవుతున్న కొత్తనగరం అని అన్నారు.లికొత్త నగరం నిర్మాణం అనేది మంచి అవకాశం, ఉత్తమ విధానాలు, అనుభవాలను ఉపయోగించి కొత్త నగరాన్ని నిర్మిస్తున్నాం. సింగపూర్ ఇప్పటికే మాస్టర్ ప్లాన్ ఇచ్చిందనీ.. నిర్మాణంలో వరల్డ్ బ్యాంక్ కూడా భాగస్వామి అవుతోందనీ పేర్కొన్నారు. గతంలో జరిగిన కొన్ని ఘటనల కారణంగా సింగపూర్ – ఏపీ ప్రభుత్వాల మద్య కొన్ని సమస్యలు వచ్చాయి. కొన్ని నిర్ణయాల కారణంగా రాష్ట్రం నమ్మకాన్ని కోల్పోయిందనీ.. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దడానికి సింగపూర్ వచ్చాననీ తెలిపారు. ఏపిలో, అమరావతిలో చేపట్టే హౌసింగ్ ప్రాజెక్టుల్లో భాగస్వాములు కావాలని సింగపూర్ హౌసింగ్ డెవల్మెంట్ బోర్డును కోరారు.

# జాగృతి కవిత దారెటు...

**హైదరాబాద్, జూలై 28:** రాజకీయాలలో స్వయం ప్రకాశకాలుగా వెలిగే వారికే విలువ ఎక్కువగా ఉంటుంది. అలాంటి వారికే అధికారం దక్కుతుంది. కొన్ని సందర్భాలలో వారు అనుకున్న లక్ష్యాలు నెరవేరకపోయినప్పటికీ.. అంతిమ కాలంలో వారు కోరుకున్న వారిని నెరవేరుతుంటాయి. అయితే తెలంగాణ రాజకీయాలలో స్వయం ప్రకాశితంగా ప్రారంభంలో వెలగలేకపోయినప్పటికీ.. ఆ తదుపరి కెసిఆర్ తన రాజకీయాల లక్ష్యాలకు అనుగుణంగా ప్రత్యర్థులను అడుగుదాక తొక్కారు. ఆ తర్వాత ఆయన స్వయం ప్రకాశంగా వెలగడం మొదలుపెట్టారు. కేటీఆర్, హరీష్ రావు, కవిత కెసిఆర్ నీడలోనే ఎదిగినప్పటికీ.. ఆ తదుపరి వారి వారి రాజకీయ క్షేత్రాలలో విజయవంతమయ్యారు.కేటీఆర్, హరీష్ రావుకు పార్టీలో ఎదురనేది లేకపోయినప్పటికీ.. కల్వకుంట్ల కవితకు 2019 పార్లమెంటు ఎన్నికల్లో నిజామాబాద్ స్థానంలో అనూహ్యంగా స్పీడ్ బ్రేక్ పడింది. అది ఆమె రాజకీయ భవిష్యత్తును తీవ్రంగా ప్రభావితం చేసింది. కెసిఆర్ ఆమెకు శాసనమండలి స్థానం ఇచ్చినప్పటికీ.. కవిత ప్రస్థానం ఒకరకంగా పార్టీలో ప్రశ్నార్థకంగానే మిగిలిపోయింది. దీనికి



తోడు ఢిల్లీలో చోటు చేసుకున్న లిక్కర్ కుంభకోణం ఆమె రాజకీయ జీవితాన్ని మరింత ప్రభావితం చేశాయి. ఆ కేసు నుంచి బెయిల్ ద్వారా ఆమె బయటికి వచ్చినప్పటికీ.. ఇప్పటికీ ఆ ఇబ్బందులు ఆమెను వేధిస్తూనే ఉన్నాయి. ఇక తాజాగా పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తన స్వరాన్ని వినిపించడం ఒకరకంగా తన తండ్రికి కోపం తెప్పించినట్టయింది. పార్టీలో నిరసన స్వరాన్ని గులాబీ అధినేత ఏమాత్రం సహించలేరు. అవసరమైతే తనతో పాటు వచ్చిన వాళ్లను.. తనతో పాటు నడిచిన వాళ్లను ఆయన దూరం చేసుకుంటారు. మొహమాటం లేకుండా బయటికి గెంటేస్తారు. ఆలే నరేంద్ర నుంచి మొదలుపెడితే ఈటెల రాజేందర్ వరకు ఈ ఉదంతాలు కళ్ళ ముందు కనిపిస్తూనే ఉన్నాయి. అయితే దీనికి కల్వకుంట్ల కవిత మినహాయింపు కాదని అనుకుంటున్నప్పటికీ.. ఇంతవరకు ఆమె పార్టీ నుంచి బయటికి వచ్చిన దాఖలాలు లేవు. కాకపోతే గులాబీ అధినేత ఆమెకు అపాయింట్మెంట్ ఇవ్వడం లేదని.. మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు తన సోదరుడితో రాజకీయంగా విభేదాలు ఉన్నాయని కల్వకుంట్ల కవిత స్వయంగా చెప్పారు. దీంతో ఆమె రాజకీయ క్షేత్రం సొంతంగానే ఉండబోతుందని సంకేతాలు కూడా ఇచ్చారు. దానికి తగ్గట్టుగానే తన సంస్థ జాగృతి ఆధ్వర్యంలో లీడర్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.హైదరాబాద్ శివారులోని ఓ ఫంక్షన్ హాల్ లో కల్వకుంట కవిత ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. సాధారణంగా కల్వకుంట్ల కవితకు గులాబీ కరపత్రిక విపరీతమైన కవరేజ్ ఇస్తుంది. కానీ ఈసారి ఎందుకనో ఆమెను దూరం పెట్టింది.

# ఆత్మరక్షణ కోసమే ఆపరేషన్ సింధూర్

**న్యూఢిల్లీ, జూలై 28:** పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఆపరేషన్ సింధూర్ పై కేంద్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలియజేసింది. పహల్గాం దాడి అనంతరం జరిగిన పరిణామాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల సమయంలో చర్చ ప్రారంభించారు. పహల్గాం ఉగ్రదాడి తరువాత ఆత్మరక్షణ కోసమే ఆపరేషన్ సిందూర్ చేపట్టామని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ తెలిపారు. లోక్‌సభలో రాజ్‌నాథ్ ప్రసంగిస్తూ.. భారత సైనికులకు హ్యాట్యాఫ్. పహల్గామ్ ఉగ్రదాడి తరువాత సైనిక చర్య భారతదేశ సైనిక సామర్థ్యానికి, నిర్ణయాత్మక నాయకత్వానికి ప్రతీక అని అన్నారు. లోక్‌సభలో రక్షణ సింగ్ రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. "ఈ దేశ సరిహద్దులను కాపాడటానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్న వీర సైనికులకు నమస్కరిస్తున్నాను. అదే సమయంలో భారతదేశ ఐక్యత, సమగ్రతను చాటి చెప్పేందుకు తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన అమరవీరులకు నేను శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను. దేశ ప్రజల తరపున సైనికులందరికీ కృతజ్ఞతలు. ఎవరైనా సైన్యం గురించి మాట్లాడితే ఆచితూచి, ఆలోచించి మాట్లాడాలని " అన్నారు.రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. "భారత పౌరులను కాపాడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంటుంది. అందుకే మే 6, 7 తేదీలలో భారత సైన్యం 'ఆపరేషన్ సింధూర్' పేరుతో చారిత్రాత్మక సైనిక చర్యను చేపట్టింది. ఇది కేవలం ఒక సైనిక చర్య మాత్రమే కాదు. ఇది భారతదేశ సార్వభౌమత్వం, గుర్తింపు, దేశ పౌరుల పట్ల కేంద్ర ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో ఉగ్రవాదంపై భారత విధానానికి ఒక ప్రభావవంతమైన ప్రదర్శన" అని పేర్కొన్నారు. రాజ్‌నాథ్ మాట్లాడుతూ, 'ఆపరేషన్ సిందూర్ నిర్వహించడానికి ముందు, భారత సైన్యం ప్రతి అంశాన్ని లోతుగా అధ్యయనం చేసింది. మాకు చాలా చాయిస్‌లు అందుబాటులో ఉన్నాయి, కాని ఉగ్రవాదులు, వారి స్థావరాలకు ఎక్కువ నష్టం కలిగించాలని నిర్ణయం తీసుకున్నాం. వఅదే సమయంలో పాకిస్తాన్ పౌరులకు ఎటువంటి నష్టం జరగకుండా ఉండేలా ఉగ్రవాద శిబిరాలను ఎంపిక చేసి నాశనం చేశాం" అని అన్నారు."భారత సైన్యం చేసిన ఈ ఖచ్చితమైన చర్యలో 9 ఉగ్రవాద స్థావరాలు ధ్వంసం అయ్యారు. ప్రాథమిక అంచనాల ప్రకారం, ఈ సైనిక చర్యలో 100 మందికి పైగా ఉగ్రవాదులు, వారికి శిక్షణ ఇచ్చే వారు, ఉగ్ర స్థావరాల నిర్వాహకులు మరణించారు. వీరిలో ఎక్కువ మంది జైషే మహ్మద్, లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిద్దీన్ వంటి ప్రమాదకర ఉగ్రవాద సంస్థలకు చెందినవారు ఉన్నారు. మరోవైపు వీరికి పాకిస్తాన్ సైన్యంతో పాటు %×ూ×%తో ప్రత్యక్ష సంబంధాలు, మద్దతు ఉన్నాయని" రాజ్‌నాథ్ అన్నారు.

**సుదర్శన చక్రం ఎంచుకోవాలని కృష్ణుడే చెప్పారు..**

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, "ధర్మాన్ని కాపాడుకోవడానికి సుదర్శన చక్రాన్ని ఎంచుకోవాలని శ్రీకృష్ణుడి



నుంచి మనం నేర్చుకున్నాము. 2006 పార్లమెంటు దాడి, 2008 ముంబై దాడులను భారత్ చూసింది. ఇప్పుడు ఇక చాలు అని చెప్పి సుదర్శన చక్రాన్ని సెలక్ట్ చేసుకున్నాం. మనతో సమానంగా ఉన్నవారిపై యుద్ధం చేయాలి. అయితే ప్రేమ, శత్రుత్వం ఒకే స్థాయిలో ఉండాలని గోస్వామి తులసీదాస్ చెప్పారు. అదే సింహం కప్పను చంపితే, అది మంచి సందేశాన్ని ఇవ్వదు. మన ఆర్మీ, సాయుధ దళాలు సింహాల్లాంటివారు..." జమ్మూకాశ్మీర్ లో ఉగ్రవాదుల ఏరివేత లక్ష్యంగా భారత ఆర్మీ ఆపరేషన్ మహదేవ్ చేపట్టింది. ఆర్మీ ఎన్ కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారని ఓ ప్రకటనలో తెలిపారు.

**22 నిమిషాల్లో పూర్తి చేశాం**

ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత సైన్యం ఎన్నో జాగ్రత్తలు తీసుకుంది.పాక్ లోని సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆపరేషన్ నిర్వహించాం.పీఓకే, పాక్ లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి 100 మంది ఉగ్రవాదులను హతమార్చాం. 7 ఉగ్రవాద స్థావరాలు పూర్తిగా నేలమట్టం అయ్యాయి.ఆపరేషన్ సిందూర్ కేవలం 22 నిమిషాల్లోనే ముగిసింది.కానీ ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ సైన్యం మనపై ప్రతీకార దాడులకు దిగింది. దాంతో మన సైనికులు మిస్సైళ్లతో విరుచుకుపడ్డారు. పాక్ అస్త్రాలను మన రక్షణ వ్యవస్థలు సమర్థంగా అడ్డుకుని, తిప్పికొట్టాయి.మన దాడుల్లో పాక్ గడ్డపై ఓ మిస్సైల్ లాంచింగ్ స్టేషన్ ధ్వంసమైంది.మన వాయుసేన పరాక్రమంతో పాక్ వణికిపోయింది. త్రివిధ దళాలు సమన్వయంతో సాగించిన దాడులకు పాక్ వద్ద సమాధానం లేకపోయింది. దాంతో కాళ్లబేరానికి వచ్చింది.ఆపరేషన్ సిందూర్ తర్వాత ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాక్ సైనికాధికారులు పాల్గొన్నారు. అదీ పాక్ చరిత్ర. ఉగ్రవాదాన్ని పాక్ పెంచి పోషిస్తోందనడానికి అదే బలమైన నిదర్శనం.1999లో శాంతిని కోరుతూ అటల్ బిహారీ వాజ్ పేయి లాహోర్ యాత్ర చేపట్టారు. కానీ ఆనాడు వాజ్ పేయి కఠిన నిర్ణయం తీసుకుని ఉంటే పాకిస్థాన్ ఆ మర్నాటి సూర్యోదయం చూసేది కాదు.

## సిట్ విచారణకు హాజరైన ప్రవీణ్ కుమార్ ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని రేవంత్ రెడ్డి పై ఫిర్యాదు



**హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా విచారణ జరుపుతున్న సిట్ అధికారులు ఇటీవల విచారణకు హాజరుకావాలని బి ఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కి నోటీసులు ఇచ్చారు. నోటీసులకు స్పందించి, సోమవారం నాడు జూబ్లి హిల్స్ పోలీస్ స్టేషన్ లోని సిట్ ఆఫీసులో అయన హాజరయ్యారు. విచారణ అనంతరం మీడియాతో మాట్లాడారు.రేవంత్ రెడ్డి పై ఫిర్యాదు చేశాను. రేవంత్ రెడ్డి సొంత పార్టీ మంత్రుల ఫోన్లు ట్యాప్ చేస్తున్నారు. పెగాసెస్ వంటి సాఫ్ట్ వేర్ సహాయంతో మంత్రుల ఫోన్లు ట్యాప్ చేస్తున్నారు . డార్క్ వెబ్ లో కొన్ని అరుదైన టూల్స్ వాడి ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారు. అందుకే రేవంత్ రెడ్డి చేస్తున్న ఫోన్ ట్యాపింగ్ పై విచారణ చేయాలి. రేవంత్ రెడ్డిని కూడా విచారణకు పిలవాలని డిమాండ్ చేసాను. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విచారించే వరకు పోరాడుతామని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి చేసే ఫోన్ ట్యాపింగ్ కు,కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మద్దతు కూడా ఉంది. రెండు పార్టీలు కలిసే ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారు.మంత్రులతో పాటు, వ్యాపారవేత్తలు,ప్రముఖులు,జర్నలిస్టుల ఫోన్లు కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ట్యాప్ చేస్తున్నట్టు ఆరోపణ. సౌత్ ఫస్ట్ పోస్ట్ లో ప్రచురించబడిన వార్తల ఆధారంగా ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. త్వరలో ఫిర్యాదు హైదరాబాద్ పోలీస్ కమీషనర్ కు కూడా ఇస్తామని,విచారణకు సిఎం ను కూడా పిలవాలని కోరుతామన్నారు. ముఖ్యమంత్రి మరియు హోం మంత్రిగా రేవంత్ రెడ్డి సిట్ ను వాడుకొంటున్నారు. రేవంత్ రెడ్డి ప్రతీకార పాలనలో భాగంగా సిట్ ను పావుగా వాడుకుంటున్నారు. రేవంత్ రెడ్డి ప్రతీకార పాలనలో పోలీసు అధికారులు సమిధలు కావద్దని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీల అమలుపై శ్నిస్తున్నందుకు,పోరాటం చేస్తున్నందుకు బిఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయాలని కుట్రలో భాగంగానే ఫోన్ ట్యాపింగ్ కేసును తెర మీదికి తెచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కు మరియు బిఆర్ఎస్ కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం. కేసిఆర్ ప్రజలను నమ్ముకొని,ఆయన చేసిన మంచి పనులు నమ్ముకొని పని చేశారు కానీ ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడలేదని తెలిపారు.

# అందుబాటులోకి వాట్సాప్ గ్రీవెన్స్



**హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. వాట్సాప్ గ్రీవెన్స్‌ను ఇవాళ(సోమవారం జులై 28) నుంచి హైదరాబాద్‌లో అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ మేరకు హైదరాబాద్ కలెక్టర్ హరిచందన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజావాణికి రాలేని వారు ఈ 7416687878 నెంబర్‌కి వాట్సాప్‌లో ఫిర్యాదులు చేయొచ్చని కలెక్టర్ తెలిపారు.ప్రతీ వాట్సాప్ కంప్లెయింట్‌ను పరిశీలించి యూనిక్ ఐడీ ఇచ్చి, వాట్సాప్‌లో అక్నాలెడ్జ్‌మెంట్ పంపుతామని వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఫిర్యాదులని కేటాయిస్తామని కలెక్టర్ చెప్పుకొచ్చారు. ప్రజావాణికి రాలేని ఉద్యోగులు, వృద్ధులు, దివ్యాంగులకు వాట్సాప్ గ్రీవెన్స్ ఫెసిలిటీ ఉపయోగంగా ఉంటుందని వివరించారు. సిటిజన్ ఫ్రెండ్లీ గవర్నెన్స్‌లో భాగంగా ఈ సర్వీస్ అందుబాటులోకి తీసుకువచ్చామని కలెక్టర్ హరిచందన పేర్కొన్నారు.

వార్తాతరంగాలు
మంగళవారం 29 జులై 2025

## టీచర్స్ ప్రమోషన్ లైన్ క్లియర్




**వరంగల్, జూలై 28:**తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ ఉపాధ్యాయులకు తీపికబురు చెప్పింది. వారికి కొద్దిరోజుల్లో పదోన్నతులు కల్పించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు సంబంధిత ఫైలుపై సీఎం రేవంత్ రెడ్డి సంతకం చేశారు. దీంతో 3,500 మందికి ప్రయోజనం కలగనుంది. విద్యాశాఖ ఒకట్రెండు రోజుల్లో పదోన్నతుల కోసం షెడ్యూల్ జారీ చేయనుంది. జూన్ 30వ తేదీ వరకు ఉన్న ఖాళీలను పరిగణలోకి తీసుకుంటారని తెలుస్తోంది.తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం వల్ల 3,500 మంది ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులు రానున్నాయి. మల్టీజోన్ -1, మల్టీజోన్-2 పరిధిలో సుమారు 900 గెజిటెడ్ హెచ్ఎం, 600 పీఎస్ హెచ్ఎం పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు. వీటితోపాటు మరో 2వేల వరకూ స్కూల్ అసిస్టెంట్ పోస్టులనూ పదోన్నతులతో నింపనున్నారు.2023 సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో మల్టీజోన్ పరిధిలోని హెచ్ఎం బదిలీలు, ఆ పోస్టులకు ప్రమోషన్లు, స్కూల్ అసిస్టెంట్లకు బదిలీలు జరిగాయి. ఆ తరువాత కోర్టు కేసులతో ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. 2024 జూన్, జులై నెలల్లో మల్టీజోన్-2 పరిధిలోని హెచ్ఎం పోస్టులతోపాటు మిగిలిన టీచర్ల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ నిర్వహించారు. ఈ క్రమంలోనే ఖాళీ అయిన గెజిటెడ్ హెచ్ఎం పోస్టుల భర్తీకి ప్రమోషన్లు ఇవ్వాలని ఇటీవల సర్కారుకు విద్యాశాఖ ప్రతిపాదనలు పంపించింది. దీనికి సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు.రెండ్రోజుల్లో ఉపాధ్యాయ ప్రమోషన్ల షెడ్యూల్ ఇవ్వనున్నారు. ముందుగా జీహెచ్ఎం సీనియార్టీ లిస్టులను మల్టీజోన్ల వారీగా ప్రకటిస్తారు. వీరికి వీటిలో ఏమైనా అబ్జెక్షన్స్ ఉంటే స్వీకరించి, ఫైనల్ సీనియార్టీ లిస్టును రిలీజ్ చేస్తారు. ఆ తరువాత వెకెన్సీలు చూపించి వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇస్తారు. అనంతరం స్కూళ్ల అలాట్ మెంట్ చేయనున్నారు. స్కూల్ అసిస్టెంట్, పీఎస్‌హెచ్ఎం, పీడీ తదితర పోస్టులన్నింటికీ ఇదే విధానాన్ని అనుసరిస్తారు.

## సిగాచి బాధితులకు నష్టపరిహారం చెల్లించలేదు

**హరీష్ రావు**



**సంగారెడ్డి:**మాజీ మంత్రి హరీష్ రావు సోమవారం నాడు సిగాచి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వం తమని పట్టించుకోవడం లేదని, ఇప్పటి వరకు పరిహారం దిక్కులేదు అని బాధితులు గోడు వెళ్లబోసుకున్నారు. తరువాత అయన ఇతర బీఆర్ఎస్ నేతలు, బాధితులతో సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కు చేరుకుని అడిషనల్ కలెక్టర్ తో మాట్లాడారు. నష్టపరిహారం కోటి ఇస్తామని ఇప్పటికీ ఇవ్వలేదని వివరించారు. డెడ్ బాడీల కోసం కుటుంబాలు కన్నీరు మున్నీరు అవుతున్నాయని చెప్పారు. సిగాచి కంపెనీ బాధితులకు ఇచ్చిన మాట ప్రకారం కోటి పరిహారం ఇవ్వకుంటే టెంట్ వేసి కూర్చొంటాం. వారికి పరిహారం అందేదాక, న్యాయం జరిగేదాక టెంట్ తీయం. బాధితుల పక్షాన బిఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు

60 కరీంనగర్ త్రీ టౌన్ కిసాన్ నగర్‌లో
కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

## వాహనాలు స్వాధీనం

**కరీంనగర్:** కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కిసాన్ నగర్‌లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో పలు అంశాలపై తనిఖీలు కొనసాగినవన్నారు. పాత నేరస్థులు అద్దెకు ఇల్లు తీసుకుని నివసిస్తున్నారా అని ఆరాదీశారు. సరైన ధృవపత్రాలు లేని 71 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 64 బైకులు, 5 ఆటోలు, ఒక ట్రాలీ ఆటో, ఒక కారు ఉన్నాయి.ఈ సందర్భంగా పోలీస్ అధికారులు స్థానిక ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

**సైబర్ నేరాలపై అవగాహన:**
సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించి, సైబర్ నేరానికి గురైనట్లయితే వెంటనే స్పందించి, నేరం జరిగిన గంట లోపల 1930 నంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా తస్కరించబడిన సొమ్మును ఫ్రీజ్ చేసి తిరిగి పొందవచ్చని తెలిపారు.మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై హెచ్చరిక: మాదక ద్రవ్యాలను దుర్వినియోగం చేయడం, వాటిని అక్రమంగా రవాణా చేయడం, అమ్మకం, వినియోగించడం చట్ట ప్రకారం నేరం అని పోలీసులు స్పష్టం చేశారు. అంతేకాకుండా, వాటి వలన కలిగే దుష్పరిణామాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు:చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని కమీషనర్ గౌష్ ఆలం హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించే వ్యక్తులపై సమాచారం అందించాలని ప్రజలను కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఏదైనా సమాచారం ఉంటే డయల్ 100 ద్వారా లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ ఆపరేషన్ ద్వారా కిసాన్ నగర్‌లో శాంతి భద్రతలను పటిష్ఠం చేయడమే కాకుండా ప్రజలలో నేరాల పట్ల అవగాహన కల్పించినట్లు పోలీసులు తెలిపారు.

## భువనేశ్వర్ జాతీయ కార్యశాలలో పాల్గొన్న కరీంనగర్ జిల్లా కలెక్టర్




**కరీంనగర్:**పారిశుధ్య కార్మికుల రక్షణ భద్రతపై ప్రసంగించిన పమేలా సత్పతి పారిశుధ్య కార్మికుల రక్షణ, భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వం భువనేశ్వర్ లో నిర్వహించిన రెండు రోజుల జాతీయస్థాయి కార్యశాలకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి ఆహ్వానం అందింది. ఈ మేరకు కలెక్టర్ ఈ కార్యశాలలో పాల్గొన్నారు.పారిశుధ్యం, ప్రజారోగ్య వ్యవస్థలకు పారిశుధ్య కార్మికులు పునాదిగా నిలుస్తున్నప్పటికీ వారు అసురక్షిత పని పరిస్థితులు, పరిమిత రక్షణలు, సామాజిక అణచివేతను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సంస్కరణల తక్షణ అవసరాన్ని గుర్తించిన ఒడిశా ప్రభుత్వం 26, 27 తేదీల్లో భువనేశ్వర్ లో కార్యశాల నిర్వహించింది. పారిశుధ్య పనులలో భద్రత, రక్షణ, పారిశుధ్య కార్మికుల గౌరవం పెంచేందుకు ఇతర రాష్ట్రాలు, సంస్థలు చేస్తున్న ప్రయత్నాలను ఈ కార్యశాలలో చర్చించారు.కార్యశాలలో కరీంనగర్ విధానాన్ని తెలియ చేసిన కరీంనగర్ జిల్లా కలెక్టర్.పారిశుధ్య కార్మికుల భద్రతకు కరీంనగర్ లో తీసుకుంటున్న చర్యలను భువనేశ్వర్ జాతీయ కార్యశాలలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వివరించారు. జిల్లాలో యూనిసెఫ్ సంస్థ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పారిశుధ్య కార్మికుల భద్రతా చర్యలను గురించి తెలియజేశారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా ప్రత్యేకంగా రూపొందించిన ఆరోగ్య కార్డులు అందచేశామని, తరచుగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్యానికి సంబంధించిన పూర్తి వివరాలను రికార్డు చేశామని తెలిపారు. వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ ఉచితంగా మందులు అందజేస్తున్నామని అన్నారు. ముఖ్యంగా మహిళా కార్మికులకు ఈ విధానం వారి ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. స్క్రీనింగ్ పరీక్షల్లో ప్రమాదకర వ్యాధులను ముందుగానే గుర్తించడం వల్ల చికిత్స అందించి వారిని ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చని సూచించారు. కంటి పరీక్షలు నిర్వహించడం, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయించడం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ముఖ్యంగా వారి ప్రధాన భద్రత కోసం కార్మికులందరికీ పిపిఈ కిట్లు, హెల్మెట్లు, గ్లౌజ్ వంటి రక్షణ కవచాలు అందించడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఉంటారని, ఈ విధానాన్ని కరీంనగర్లో విజయవంతంగా అమలు చేశామని వివరించారు.

# సీఎం రమేష్ టార్గెట్ ఎందుకు..



**హైదరాబాద్, జూలై 28:** సీఎం రమేశ్.. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి ఎంపీ.. 2024లో బీజేపీ తరఫున పోటీ చేసి భారీ మెజారిటీతో గెలిచారు. అంతకు ముందు టీడీపీలో ఉన్నారు. ఇక సీఎం రమేశ్ మొదటి నుంచి ఏ1 కాంట్రాక్టర్. అనేక కంపెనీలు ఉన్నాయి. తాజాగా అనకాపల్లి ఎంపీకి.. సిరిసిల్ల ఎమ్మెల్యే.. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి తనయుడు.. మాజీ ముఖ్యమైన మంత్రి కేటీఆర్‌కు మధ్య వివాదం తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో ఒక రోడ్ కాంట్రాక్ట్‌ను రిత్విక్ ప్రాజెక్ట్స్ సంస్థ దక్కించుకున్న విషయాన్ని ఆధారంగా చేసుకుని కేటీఆర్, రేవంత్ రెడ్డి ప్రభుత్వం, సీఎం రమేష్ మధ్య లింక్ పెట్టి విమర్శలు చేస్తున్నారు.రిత్విక్ ప్రాజెక్ట్స్ సంస్థ హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో ఒక రోడ్ కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. ఈ సంస్థ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌కు చెందినది. ఈ కాంట్రాక్టు కూడా కాంపిటీటివ్ టెండర్ ప్రక్రియ ద్వారానే రిత్విక్ ప్రాజెక్ట్స్ దక్కించుకుంది. కానీ, తెలంగాణ మాజీ ముఖ్యమైన మంత్రి దీనిని జీర్ణించుకోలేకపోతున్నారు. తెలంగాణ సెంటిమెంటును మళ్లీ రగల్చాలి.. కాబట్టి.. రేవంత్, సీఎం రమేశ్‌కు లింకు పెట్టి విమర్శలు చేస్తున్నారు. దీని ఆధారంగా రచ్చ మొదలు పెట్టారు. ఒక బీజేపీ ఎంపీకి కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ ఇచ్చిందని పేర్కొంటున్నారు. తద్వారా కాంగ్రెస్, బీజేపీ దోస్తీ అనే మెస్సేజ్‌ను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. అంతటితో ఆగకుండా హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూములను తాకట్టు పెట్టడానికి సీఎం రమేశ్ సహకరించారని అనుకుంటున్నారు. ఫలితంగా ఫ్యూచర్ సిటీ కాంట్రాక్టు సీఎం రమేశ్ కంపెనీకి గిఫ్ట్‌గా ఇచ్చారని కేటీఆర్ ఆరోపిస్తున్నారు.కేటీఆర్ ఆరోపణలకు కనీస లాజిక్ లేకుండా పోయినట్లుగా కనిపిస్తోంది. సీఎం రమేష్ వ్యక్తిగత హోదా లేదా వ్యాపారాలు ఈ వ్యవహారంలో ఎలా సహకరించాయో చెప్పలేకపోవడం ఇందుకు ఒక ఉదాహరణ. గతంలో సీఎం రమేశ్ తన సామాజికవర్గం సహకరిస్తుందని కొన్ని అంశాల్లో కేటీఆర్ సాయం అడిగారని, కానీ ఆయన అహంకారం వల్ల సహకారం అందలేదని ప్రచారం జరుగుతోంది. ప్రతిపక్షంలో ఉన్నాం కాబట్టి ప్రభుత్వంపై విమర్శలు చేయాలి కాబట్టి.. మనకు కలిసి వస్తుందని ఏది పడితే అది మాట్లాడితే విమర్శలు తప్పవు. కానీ, తెలివైన కేటీఆర్.. ఇటీవల సహనం కోల్పోయి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ప్రతీ విషయంలో బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు.మొత్తంగా సీఎం రేవంత్‌రెడ్డిపై ఉన్న కోపాన్ని.. కేటీఆర్ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌పై చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి విమర్శలు, ఆరోపణలు కేటీఆర్‌కు మంచి చేయకపోగా.. ఆయన ఇమేజ్‌ను మరింత డ్యామేజ్ చేయడం ఖాయం.

**మధ్యలో ఎంటరైన బండి**

బీజేపీ ఎంపీ సీఎం రమేష్, మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య మాటల యుద్ధంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ నడవడం కష్టం. సీఎం రమేష్ చెప్పింది వాస్తవమేనని అన్నారు.కేసీఆర్ తన కొడుక్కి మొదట టికెట్ ఇవ్వలేదు. సిరిసిల్లలో కేటీఆర్‌కు టికెట్ ఇప్పించింది సీఎం రమేష్. ఆయన వల్లే కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యాడు. కేటీఆర్‌కు ఆయన ఆర్థిక సహాయంకూడా చేశారని బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసుకునేది లేదు. బీఆర్ఎస్ అంటే.. బిడ్డా, అల్లుడు, కొడుకు.. అయ్య పార్టీ. ఆ పార్టీ నడిపే స్థితిలో లేరు. పూర్తిగా అవినీతిలో కూరుకుపోయి.. పార్టీని నడపడం వారికి చేతకావడం లేదని బండి సంజయ్ అన్నారు.సీఎం రమేష్ సవాల్ కు కేటీఆర్ సిద్ధమా.. లేదా అనేది చెప్పాలి. ఆయనతో కేటీఆర్ చర్చకు వస్తారా.. నేను మధ్యవర్తిగా ఉంటా. కరీంనగర్ లోనే వేదిక ఏర్పాటు చేస్తా. సీఎం రమేష్ ను తీసుకొస్తా. నువ్వు వస్తావా కేటీఆర్..? తేదీ నువ్వే చెప్పు.. మేము రెడీ. బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేస్తామన్నది వాస్తవం కాదా..? అంటూ బండి సంజయ్ ప్రశ్నించారు.సీఎం రమేష్ వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డికి సంబంధం లేదు. కేటీఆర్ బాష సరిగా లేదు. సంస్కారంలేని సంస్కారహీనుడు అతను. ముఖ్యమంత్రిని హౌలే, వాడు, వీడు అనడం కరెక్ట్ కాదు. పోలీసులను పోలీసోడు అనడం కరెక్ట్ కాదు. కేటీఆర్ నీ బాష మార్చుకో. నేను హోం మినిస్టర్‌ను ఇలా చెప్పొద్దు.. కానీ, చెప్పాల్సి వస్తుంది.. నీ బాష తీరు మార్చుకోకపోతే దాడులు చేస్తాం అంటూ బండి సంజయ్ హెచ్చరించారు. వంద యూట్యూబ్ ఛానెళ్లు పెట్టుకొని హద్దులు మీరుతావా.. చూస్తూ ఊరుకోం అని బండి సంజయ్ అన్నారు.

# రెచ్చిపోతున్న కల్తీ మద్యం మాఫియా

**నల్గొండ జూలై 28:**తెలంగాణ టూ ఆంధ్రా వయా తెలంగాణ సరిహద్దు గ్రామాలు.. ఇలా కల్తీ మద్యం మాఫియా రెచ్చిపోతోంది. తాజాగా సూర్యపేటలో ఏకంగా పంటపొలాలు తవ్వితే రెండు వేరు వేరు చోట్ల భారీగా కల్తీ మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న వేళ కల్తీ సరకును ఇలా భూమిలో దాచి మరీ సిద్ధం చేశారా అనే అనుమానాలు బలపడుతున్నాయి. తెలంగాణకు సరిహద్దు జిల్లా సూర్యపేట కావడంతో ఈ ప్రాంతాన్ని అడ్డగా చేసుకున్న కల్తీ మద్యం కేటుగాళ్లు భారీ స్థాయిలో సరకు నిల్వ చేయడంతోపాటు ఆంధ్రాలోని వివిధ జిల్లాలకు ఇక్కడి నుంచి కల్తీ సరకు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కల్తీ మద్యం మాఫియాను సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులలో కీలకంగా మారిన ప్రవీణ్ ఇచ్చిన సమాచారం ఆధారంగా రంగంలోకి దిగిన ఎక్సైజ్ పోలీసులు సూర్యపేటలోని మేళ్ల చెరువుకు సమీపంలోని వ్యవసాయ భూముల్లో జేసిబిలతో తవ్వకాలు చేపట్టారు.జేసీబీలతో భూమిని తవ్వుతున్నకొద్దీ కేసుల కల్తీ మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. వేలాదిగా వివిధ బ్రాండ్ లకు చెందిన మద్యం బాటిల్స్ ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల అదుపులో ఉన్న మరో వ్యక్తి ఇచ్చిన సమాచారంతో దొండపాడు, రామాపురంలో తవ్వకాలు చేపట్టిన ఎక్సైజ్ శాఖ



అధికారులకు కళ్లుచెదిరేలా మద్యం సీసాల డంప్ లు దర్శనమిస్తున్నాయి. భూమిని త్వవుతున్న కొద్దీ కాటన్ల లో నిల్వ ఉంచిన కల్తీ మద్యం కంటపడుతోంది. 2014 ఎన్నికల సమయంలోనే ఇక్కడ భారీగా కల్తీ మద్యం భూమిలో దాచి ఉంచి, ఇక్కడి నుంచే తెలంగాణ, ఆంధ్రాలోని వివిధ జిల్లాలకు సరఫరా చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. ముఖ్యంగా ఏపీలోని బెల్టు షాపులే టార్గెట్‌గా గతేడాది నుంచి కల్తీ మద్యం దందా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నట్లుగా గుర్తించారు. ఇదిలా ఉంటే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లాలకు సరఫరా చేసేందుకు భారీగా కల్తీ మద్యం నిల్వ ఉంచడంతోపాటు, మద్యం తయారీకి ఉపయోగించే 14వేల లీటర్ల స్పిరిట్ స్వాధీనం చేసుకున్నారంటే ఎంతలా కల్తీ మద్యం తెలుగు రాష్ట్రాల్లో విచ్చలవిడిగా సరఫరా జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు.ఇంతలా మందుబాబుల ప్రాణాలు తీసే ఈ కల్తీ మద్యం హైదరాబాద్ కేంద్రంగా తయారవుతున్నట్లుగా గుర్తించారు. ఉప్పల్ లోని శ్రీకృష్ణా ఫార్మసీ నుంచి కల్తీ మద్యం తయారీకి అవసరమైన స్పిరిట్ సరఫరా చేస్తున్నట్లు తేలింది. ఈ ఫార్మసీ నుంచి నవ్వా ఎజెన్సీ స్పిరిట్ కొనడంతోపాటు గుట్టుచప్పుడు కాకుండా రైస్ మిల్లులను అడ్డగా చేసుకుని కల్తీ మద్యం తయారు చేస్తున్నట్లుగా గుర్తించారు. సుమారుగా 180 ప్రముఖ బ్రాండ్లకు చెందిన మద్యాన్ని కల్తీ చేయడంతోపాటు, దాదాపు అదే బ్రాండ్‌ను పోలి ఉండేలా మద్యం తయారు చేసి బెల్టు షాపులకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు.ప్రమాదకరమైన రెక్టిఫైడ్ స్పిరిట్ ను మద్యం తయారిలో వాడటంతోపాటు, ఎంత మోతాదులో స్పిరిట్ కలపాలి అనేదాని కోసం ప్రత్యేకంగా మిషన్ ఏర్పాటు చేసుకుని స్పిరిట్ 25 శాతం ఉండేలా కల్తీ సరకు తయారు చేస్తున్నారు. బాటిల్ కు రెండు వైపులా లేబుల్ వేయడం , మూతలు ఫిక్స్ చేయడం ఇలా దాదాపు ఒరిజినల్ ను తలపించేలా మద్యం తయారు చేస్తున్నారు. కల్తీ మద్యం మాఫియాకు చెక్ పెట్టేందుకు ఇప్పటికే పరారీలో ఉన్న మరో నలుగురి కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయి.

## ట్యాపింగ్ ఫైల్స్... రోజుకో మలుపు

**హైదరాబాద్, జూలై 28:**తెలంగాణ ట్యాపింగ్ ఫైల్ పాలిటిక్స్‌లో హైవోల్టేజ్ హీట్‌ను క్రియేట్ చేస్తున్నాయి. రోజుకో లీకు..వారం రోజులకో ఇద్దరిని విచారిస్తూ..కేటీఆర్ చుట్టూ ఉచ్చు బిగుస్తోందంటూ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై గాలి గత్తర నడుస్తూనే ఉంది. ఈ ప్రచారానికి చెక్ పెట్టేందుకు బీఆర్ఎస్ కూడా రివర్స్ రూట్‌లో వస్తోంది. తాము ఫోన్ ట్యాప్ చేయలేదని చెప్పడం కంటే..సీఎం రేవంత్ కూడా ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని..అందుకు ఉదాహరణలు ఇవ్వే అంటూ దుమ్మెత్తిపోస్తోంది.రేవంత్‌రెడ్డి కూడా మంత్రులు, అపోజిషన్ లీడర్లతో పాటు వేలాది ఫోన్లు ట్యాప్ చేయిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావులు ఆరోపిస్తూ వస్తున్నారు. కేటీఆర్ అయితే మరో అడుగు ముందుకేసి..తన సీటుకు ఎవరు ఎసరు పెడతారో అనే భయంతో సహచర మంత్రుల ఫోన్లను కూడా రేవంత్ ట్యాప్ చేయిస్తున్నారని బాంబు పేల్చారు.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, ఉత్తమ్ ఫోన్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్యాపింగ్ చేయిస్తున్నారని కేటీఆర్ ఓపెన్‌గానే చెప్పేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై లై డిటెక్టర్ టెస్ట్‌కుకు సిద్ధమా అంటూ సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ కూడా విసిరారు. బీఆర్ఎస్ నేత, రిటైర్డ్ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అయితే ఇంకో అడుగు ముందుకేసి కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్ కూడా సీఎం ట్యాప్ చేయిస్తున్నారని పెద్ద మాటే అనేశారు.ఇక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మరో రెండు అడుగులు ముందుకేసి తన భార్య ఫోన్‌ను కూడా ట్యాప్ చేస్తున్నారని..16మంది హీరోయిన్ల ఫోన్లు కూడా ట్యాప్ చేస్తున్నారంటూ లెక్కలతో సహా సంచలన ఆరోపణలు చేశారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ట్యాపింగ్ వార్ పీక్ లెవల్‌కు చేరుకుంది. కౌశిక్‌రెడ్డి కామెంట్స్‌పై కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు పదుల సంఖ్యలో ఫిర్యాదులు చేయడం ఆయనపై కేసులు నమోదవడంతో ట్యాపింగ్ ఫైటింగ్ ఉత్కంఠ రేపుతోంది. కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేస్తారన్న సమాచారంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆయన ఇంటి దగ్గర భారీగా గుమిగూడటంతో మరోసారి న్యూస్ హెడ్‌లైన్‌గా మారింది ట్యాపింగ్ ఎపిసోడ్.అయితే తమ హయాంలో ఫోన్ ట్యాపింగ్ జరగలేదని..ఒకవేళ ట్యాపింగ్ జరిగినా తనకు సంబంధం లేదని కేటీఆర్ ఎంత చెప్తున్నా అనుకున్నంతగా పబ్లిక్‌లోకి వెళ్లడం లేదట. సిట్ దర్యాప్తు అంటూ ఇస్తున్న లీకులతో అడ్డగోలు ప్రచారం జరుగుతోందని బీఆర్ఎస్ అధినాయకత్వం గ్రహించిందట. అందుకే కారు రివర్స్ గేర్ వేయాల్సిందేనని ఫిక్స్ అయ్యారట. దాంతో ట్యాపింగ్ ఇష్యూను..ట్యాపింగ్ ఆరోపణలతోనే తిప్పికొట్టే ప్రయత్నం చేస్తోంది బీఆర్ఎస్. అందుకు తగ్గట్లుగా ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నామని సీఎం ఆఫ్ ది రికార్డులో చెప్పినట్లు వచ్చిన వార్తలను అస్త్రంగా మల్చుకుంటోంది కారు పార్టీ.మంత్రులు మాట్లాడుకున్న ఫోన్ సంభాషణను సీఎం విన్నారని.. ప్రైవేటు హ్యాకర్లతో ఫోన్లు ట్యాప్ చేస్తున్నారని సీరియస్ అలిగేషన్ చేశారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి. ట్యాపింగ్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డిపై మంత్రులు కాంగ్రెస్ అధిష్టానానికి ఫిర్యాదు చేశారని..మంత్రులు ఢిల్లీలోనే ఉండిపోవడంతో..శుక్రవారం జరగాల్సిన మంత్రివర్గ సమావేశం వాయిదా పడిందని బీఆర్ఎస్ కాస్త గట్టిగానే వాయిస్ రేజ్ చేస్తోంది. ఫోన్ ట్యాపింగ్ అంశం తేలే దాకా మంత్రివర్గ సమావేశానికి హాజరు కాబోమని మంత్రులు తేల్చి చెప్పారని కూడా అంటున్నారు గులాబీ పార్టీ నేతలు. అంతే కాదు సోమవారం మంత్రివర్గ సమావేశం జరిగేది కూడా డౌటేనని అంటోంది గులాబీ పార్టీ.సీఎం రేవంత్ రెడ్డి తన సహచర మంత్రుల ఫోన్లతో పాటు హీరోయిన్ల ఫోన్లు కూడా ట్యాప్ చేసి ఎవరేం మాట్లాడుకుంటున్నారో వింటున్నారంటున్న బీఆర్ఎస్ ఆరోపణల్లో వాస్తవం ఎంతుందో గానీ..తెలంగాణ రాజకీయాల్లో మాత్రం సంచలనం రేపుతోంది. బీఆర్ఎస్ లీడర్లు చేసిన ట్యాపింగ్ ఆరోపణలతో క్యాబినెట్‌లో కలకలం నడుస్తూనే ఉంది. ఇక అధికార కాంగ్రెస్ నేతల్లో కూడా ట్యాపింగ్ గుబులు టెన్షన్ పెడుతోందట.గులాబీ నేతలు చెప్తున్నట్లు నిజంగానే ట్యాపింగ్ చేస్తున్నారా? తాము ఎవరెవరితో మాట్లాడుతున్నామో, ఎవరెవరిని కలుస్తున్నామో సీఎం రేవంత్ రెడ్డి అంతా తెలుసుకుంటున్నారా అని మంత్రులతో సహా పార్టీ లీడర్లలో కూడా అనుమానం వ్యక్తమవుతోందట. అయితే కేసీఆర్ హయాంలో జరిగిన ట్యాపింగ్ బాగోతంపై నిజాలు బయటకు రావొద్దనే..బీఆర్ఎస్ నేతలు అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర లేపారని కూడా కాంగ్రెస్ కూడా కౌంటర్ ఇస్తోంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య జరుగుతోన్న ఈ ఫోన్ ట్యాపింగ్ ఆటలో పైచేయి సాధించేదెవరో చూడాలి

## తుంగభద్ర జలాశయానికి వరద ఉధృతి

**ప్రాజెక్టు 24 గేట్లు ఎత్తివేసి వరదనీటిని క్రిందికి విడుదల**



**హైదరాబాద్ జూలై 28:**తుంగభద్ర జలాశయానికి వరద ఉధృతి పెరుగుతుంది.దీనితో తుంగభద్ర ప్రాజెక్టు 24 గేట్లు ఎత్తివేసి వరదనీటిని క్రిందికి వదులుతున్నారు. తుంగభద్ర జలాశయానికి ఇన్ ఫ్లో 96, 836 క్యూసెక్కులు ఉండగా ప్రాజెక్టు 24 గేట్లు ఎత్తి 1,00, 720 క్యూసెక్కులు నీటిని దిగువకు అధికారులు విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 105 టిఎంసిలుగా ఉండగా ప్రస్తుత నీటి నిల్వ 75 టిఎంసిలుగా ఉంది. గేట్ల సమస్య కారణంగా ఈ ఏడాది 80 టిఎంసిలే అధికారులు నిల్వ చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచించారు.

### జూరాల ప్రాజెక్టు 12 గేట్లు ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల

**హైదరాబాద్ జూలై 28:**జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది.దీనితో జూరాల ప్రాజెక్టు 12 గేట్లు ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు జూరాల జలాశయానికి ఇన్ ఫ్లో1,00,257 వేల క్యూసెక్కులుండగా ఔట్ ఫ్లో 92,556 క్యూసెక్కులుగా ఉంది.. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318.816 మీటర్లు ఉండగా ప్రస్తుత నీటి నిల్వ 317.170 మీటర్లుగా ఉంది. జూరాల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 7.795 టిఎంసిలుండగా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 9.657 టిఎంసిలుగా ఉంది. విద్యుత్ ఉత్పత్తి ఐదు కేంద్రాలలో కొనసాగుతోంది.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి...



**దేవరకద్ర జులై 28 (స్మై న్యూస్):** దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి అధ్యక్షతన దేవరకద్ర మండల సమన్వయ కమిటీ సమావేశము హెచ్ హాజీలాపూర్ గ్రామంలో నిర్వహించారు. మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి మాట్లాడుతూ హెచ్. హాజలాపూర్ గ్రామంలో సమన్వయంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఘన విజయంతో గెలిపించుటకు ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో దేవరకద్ర మండల సమన్వయ కమిటీ సభ్యులు హనుమంత్ రెడ్డి, కోన రాజశేఖర్, శ్రీకాంత్ రెడ్డి, సురేందర్ రెడ్డి, చంద్రమౌళి, కుమ్మరి రాంబాబు, ఉసెనప్ప, సత్యనారాయణ, జాఫర్, పూర్ణిత, జైపాల్ రెడ్డి, హెచ్ హాజీలాపూర్ గ్రామ అధ్యక్షులు కన్నయ్య, ఉపాధ్యక్షులు జగన్నాథరెడ్డి, ప్రతాపరెడ్డి, జగన్మోహన్, బొజ్జన్న గౌడ్, నారాయణ గౌడ్, బలిజ రాజేందర్ , వేణు గౌడ్, వేణుగోపాల్, నర్సింలు , సాయిరాం, కురువ ఆంజనేయులు, కురువ హనుమన్న, బోయ కృష్ణ, బోయ సత్యన్నా, కురువ దీన్ మల్లప్ప, కురువ తిరుపతి, ఫక్కిరన్న గౌడ్ , దిలీప్, కురువ అంజి, కర్ణాకర్ గౌడ్, కరుణ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి డెలివరీ పిహెచ్సి నందు లేదా జిల్లా ఆస్పత్రిలో కావాలి

:- ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య కిరణ్మయి



**జోగులాంబ గద్వాల,జులై29(స్మై న్యూస్):**ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉప్పేరు పరిధిలో ఉన్న జమ్మిచెడు సబ్ సెంటర్ ను ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జె సంధ్యా కిరణ్ మేడం సందర్శించి 36 సబ్ సెంటర్ రికార్డ్స్, ఆశా రికార్డులపై అవగాహన కల్పించారు, ముఖ్యంగా అన్ని ఆరోగ్య కార్యక్రమాల యందు అవగాహన ఉండాలని, గ్రామాల యందు ఉన్న గర్భిణీ స్త్రీల హిమోగ్లోబిన్ పర్సంటేజ్ 10నుండి 12 గ్రాములు ఉండేటట్లు చూసుకోవాలని ప్రతి గర్భిణీ పిహెచ్సి, సబ్ సెంటర్ జిల్లా ఆసుపత్రి నందు డెలివరీలకు తీసుకొని వెళ్లాలని,అదేవిధంగా జిల్లా ఆస్పత్రిలో ఉన్న, మెంటల్ హెల్త్, వెల్డర్లీ కేర్, ఎన్సిడి ఫాలోప్స్, సర్వేకల్ క్యాన్సర్ బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్, చేపించాలని , సందర్భంగా సిబ్బందికి తెలియజేశారు..త్వరలో ఎన్సిడి స్క్రీనింగ్ మొదలవుతుందని విహెచ్ఆర్ రిజిస్టర్ నందు 30 ం వారికి అందరికీ స్క్రీనింగ్ నిర్వహించాలని తెలిపారు...ఈ కార్యక్రమానికి జిల్లా ఎన్సీడీ సమన్వయ కార్యకర్త శ్యాంసుందర్, ప్రేమలత, ఏఎన్ఎం శోభారాణి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# కనీస వేతనం 26,000 కాంట్రాక్ట్ కార్మికుల రెగ్యులేషన్ కై జూలై 31న జరిగే ధర్నాలు జయప్రదం చేయండి




**దేవరకద్ర, అమరచింత జూలై 28 (స్మై న్యూస్):** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో కార్మిక వర్గానికి కనీస వేతనం 26,000 ఇవ్వాలని కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికుల రెగ్యులర్ చేయాలని పెన్షన్ 9000 రూపాయలు ఇవ్వాలని పని వ్యతిరేకించాలని డిమాండ్ చేస్తూ టియుసిఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా, జులై 31న వనపర్తి కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని టి యు సి ఐ జిల్లా ఉపాధ్యక్షులు సి రాజు, పిలుపునిచ్చారు. సోమవారం అమరచింత మండలంలోని పామిరెడ్డి పల్లె కేజీబీవీలో ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా కనీస వేతనాలు లేకుండా అత్యధిక పని గంటలకు కేజీబీవీ వర్కర్స్ శ్రమదోపిడికి గురవుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల నాడు కార్మికులను రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చిందని హామీ దృష్ట్యా కార్మికుల అందరిని రెగ్యులర్ చేయాలని కనీస వేతనం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ వర్కర్స్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రమోషన్ లేకుండా మగ్గిపోతున్నారని ఆయన ఆవేదన చెందారు. ఏ విధమైన జీవోలను నాన్ టీచింగ్ సిబ్బందికి అమలు కావడం లేదని ఇందులో తీవ్ర వివక్ష ఎదుర్కొంటున్నారన్నారు. పని భారం పెరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎస్ ఐ పి ఎఫ్ హెల్త్ స్కీములు ప్రమాద బీమా లాంటి న్యాయ హక్కులు కూడా వారికి లేవని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం 31న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టి యు సి ఐ జిల్లా నాయకులు ఏ సామెలు,కేజీబీవీ వర్కర్స్ అనురాధ, శోభ, నందిని, చంద్రకళ,అంజనమ్మ, తహెరా,విమల, హాబిభ, తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్ అవైలబుల్ లో ప్రవేశాలు

**జోగులాంబ గద్వాల,జులై29(స్మై న్యూస్):**2025%-%26 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో 1వ తరగతి (నాన్ రెసిడెన్షియల్) మరియు 5వ తరగతి (రెసిడెన్షియల్) సీట్లకు జూన్ 20వ తేదీన లక్కీ డిప్ ద్వారా విద్యార్థుల ఎంపిక చేయడం జరిగిందని, అయితే గ్రూప్-3 లో మిగిలిన సీట్లకు దరఖాస్తులు లేకపోవడంతో కలెక్టర్ ఆదేశానుసారం గ్రూప్-1 మరియు గ్రూప్-2 నుంచి విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి నుషిత ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ఎంపిక రేపు మంగళవారం మధ్యాహ్నం 2:00 గంటలకు, కలెక్టర్ కార్యాలయంలో లక్కీ డిప్ ద్వారా నిర్వహించబడుతుందని గతంలో దరఖాస్తు చేసుకొని ఎంపిక కాని అభ్యర్థులు తప్పక హాజరుకావాలని ఆమె ఈ ప్రకటన ద్వారా తెలియజేశారు.

# ప్రజావాణికి 69 దరఖాస్తులు



**జోగులాంబ గద్వాల,జులై29(స్మై న్యూస్):** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అధికారులకు సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 69 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు లకు అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాత బిల్డింగ్ ను కూల్చి,నూతన బిల్డింగ్ నిర్మాణం చేయాలి: పి డి ఎస్ యు



**నారాయణపేట జులై 28 (స్మైన్యూస్)** ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాత బిల్డింగ్ ను కూల్చి,నూతన బిల్డింగ్ నిర్మాణం చేయాలి. మూత్రశాలలలో,మరుగుదొడ్లు నిర్మాణం చేయాలని (పి.డి.ఎస్ యు) జిల్లా అధ్యక్షుడు ఎస్.సాయికుమార్ అన్నారు.నారాయణపేట జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల పాత బిల్డింగ్ ను కూల్చివేయాలని,శిథిల వ్యవస్థలో ఉన్న మూత్రశాలలలో,మరుగుదొడ్లు త్వరగా పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పరిమిత రెడ్డి గారికి. (పిడిఎస్ యు) ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా (పి.డి.ఎస్.యు) జిల్లా అధ్యక్షుడు ఎస్.సాయికుమార్ మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా నారాయణపేట జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కొనసాగుతున్నది. ఆ బిల్డింగ్ పాతది కావడంతో కొన్ని క్లాస్ రూమ్స్ పెచ్చులు ఊడిపోవడం తో, నూతనంగా గత మూడు సంవత్సరాల కింద కొత్తగా కొన్ని క్లాస్ రూములను నిర్మాణం చేశారు.కానీ ఇప్పటికి కొన్ని క్లాసులు ఆ పాత బిల్డింగ్ లోనే కొనసాగుత ఉన్నాయి.ఈ పాత బిల్డింగ్ ని పడగొట్టాలని గతంలో స్థానిక ఎమ్మెల్యేకు మరియు జిల్లా కలెక్టర్ కు రాతపూర్వకంగా వినతి పత్రం కూడా ఇవ్వడం జరిగింది.దానికి అమౌంట్ కూడా శాంక్షన్ అయినవని చెప్పారు. కానీ నేటికీ వరకు స్టార్ట్ కాలేదు. విస్తృతంగా అకాల వర్షాలు కురుస్తుండడంతో కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు తిరిగే సమయంలో గోడలు కూలితే విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నది. ఇప్పటికే కొన్ని క్లాస్ రూమ్ లో పై పెచ్చులూడి పడుతున్న పరిస్థితి ఉన్నది. మొన్న కాల వర్షాలకు రాజస్థాన్ రాష్ట్రంలో స్కూల్ పాత బిల్డింగ్ కూలి ఏడు మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. 30 మందికి పైగా గాయాల పాలైన పరిస్థితి ఉన్నది. తక్షణమే స్పందించి ఆ పాత బిల్డింగ్ ను కూల్చివేయడానికి పనులు ప్రారంభించే రకంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ కళాశాలలో దాదాపు 500 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుంటారు. కానీ వాళ్లకు తగిన మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. గర్ల్స్ కు మూడు ఉన్న అవి కూడా ,శిథిల వ్యవస్థలో ఉన్నాయి. బాయ్స్ కు అసలే లేని పరిస్థితి ఉన్నది. దీనితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి ఉన్నది.విద్యార్థుల సంఖ్య కు అనుకునంగా ,శిథిల వ్యవస్థలో ఉన్న మూత్రశాలను, మరుగుదొడ్లు పూర్తి చేయాలని, కళాశాల పాత బిల్డింగ్ ను వెంటనే కూల్చాలని స్థానిక ఎమ్మెల్యే కి వివరించడం జరిగింది. స్పందించిన ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి వెంటనే పనులు ప్రారంభించాలని ఉన్నత అధికారులతో ఫోన్లో మాట్లాడుతూ ఆదేశాలు ఇవ్వడం జరిగింది. తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రంను స్థానిక ఎమ్మెల్యే చిట్టెంపర్ణిక రెడ్డి కి ఇవ్వడం జరిగింది. ఎమ్మెల్యేను కలిసిన వారిలో (పి.డి.ఎస్. యు ) జిల్లా సహకార దర్శి వెంకటేష్ ,జిల్లా కోశాధికారి మహేష్ ,నాయకులు సురేష్ (పి.డి.ఎస్.యు) బృందం పాల్గొన్నారు.

# స్వర్గీయ రాజీవ్ గాంధీ ఆశయాలను ముందు తీసుకెళ్లాలి...

జాతీయ కో. ఆర్డినేటర్ కిరణ్ మూగబసవ





**నారాయణపేట జులై 28 (స్మై న్యూస్)** గ్రామాల అభివృద్ధి చెందినపుడే దేశం అభివృద్ధి సాధిస్తుందని భావించి పంచాయతీ రాజ్ చట్టానికి సవరణ చేసి ముడు అంచెల విధానాన్ని ప్రవేశ పెట్టిన మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ ఆశయాన్ని అందరం ముందుకు తీసుకెళ్లాలని రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జాతీయ కో. ఆర్డినేటర్ కిరణ్ మూగభసవా కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సూచించారు.టిపిసిసి ఇంచార్జి మీనాక్షి నటరాజన్ సూచన మేరకు సోమవారం నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో (సివిఆర్ భవన్)డిసీసీ అధ్యక్షులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జిల్లా రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్బంగా జాతీయ కో. ఆర్డినేటర్ కిరణ్ మూగబసవ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రజలకు స్వయం పరిపాలన కల్పించి గ్రామాలను అభివృద్ధి చెందే విధంగా నాటి ప్రధాని రాజీవ్ గాంధీ చేసిన కృషి వల్లనే నేడు గ్రామాలు అభివృద్ధి బాటలో ఉన్నాయన్నారు.రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ ను అనుసరించే తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం యస్సి వర్గీకరణ,మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, బీసీలకు 24 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని వాటిని ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు.త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి ఎన్నికయ్యే ప్రజాప్రతినిధులు గ్రామాలు అభివృద్ధి చెందే విధంగా కృషి చేయాలన్నారు. పార్టీ నుండి పోటీ చేసే ప్రతి ఒక్కరికి రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ కార్యక్రమం పై అవగాహన పెంచుకోవాలన్నారు.ప్రతి మండలం నుండి ఇద్దరిని ఎంపిక చేసి త్వరలో సర్వోదయ సంకల్ప శిభిరం నిర్వహించి శిక్షణ ఇస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎండి. సలీం,అర్జీపిఆర్ఎస్ ఉమ్మడి జిల్లా కో. ఆర్డినేటర్ రాజేంద్ర ప్రసాద్, జిల్లా కో. ఆర్డినేటర్ మహేష్, వివిధ మండలాల అధ్యక్షులు సుధాకర్, వీరన్న,బాల్ రెడ్డి, ఆనంద్ గౌడ్, రాజప్ప గౌడ్, గొల్ల కృష్ణయ్య,జిల్లా ఫిషరీస్ చైర్మన్ కాంత్ కుమార్,పిఏసిఎస్ చైర్మన్ ఈదప్ప,బోయ. శరణప్ప,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కోట్ల మధుసూదన్ రెడ్డి,మల్లేష్,యూసుఫ్ తాజ్,పల్ల అనిల్,కుర్వ. మనోజ్,వెంకు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కవరేజ్ 1.25 కోట్లు

సింగరేణి ఉద్యోగులకు శాలరీ ఎకౌంటు పంజాబ్ నేషనల్ బ్యాంక్ లో కలిగినవారికి




**కొత్తగూడెం జులై 28 (స్మై న్యూస్ ):**సింగరేణి యాజమాన్యం వారు ఉద్యోగుల సంక్షేమం అలాగే వారి శ్రేయస్సు కొరకు ఇంతగానో కృషి చేస్తుంది అందులో భాగంగా సింగరేణి యాజమాన్యం వారు గతంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా వారితో వారి బ్యాంకు నందు శాలరీ ఎకౌంటు కలిగి ఉన్న సింగరేణి ఉద్యోగులస్తులకు యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కవరేజ్ ను కోటి రూపాయల నుండి కోటి 25 లక్షల రూపాయల వరకు ఇచ్చేలా ఒప్పందం చేసుకోవడం జరిగింది.నూతనంగా సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం (ఐ.ఆర్.ఎస్) ఆధ్వర్యంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ వారితో యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కవరేజ్ పై కోటి 25 లక్షల యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కవరేజ్ పై ఒప్పందం చేసుకోవడం జరిగింది.కావున ఉద్యోగస్తులందరూ వారి అనుకూలతను బట్టి పై తెలిపిన బ్యాంకులలో నూతనంగా ఒప్పందం జరిగిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ నందు వారి శాలరీ ఎకౌంటును కలిగి ఉన్నట్లయితే దురదృష్టవశాత్తు ఏమైనా యాక్సిడెంట్ ప్రమాదాల జరిగి మరణించిన ఉద్యోగస్తుల కుటుంబాలకు పై తెలిపిన యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కరేజ్ క్రింద బ్యాంకు నుండి వారి కుటుంబ సభ్యులకు రూపాయలు కోటి నుండి కోటి 25 లక్షలు కవరేజ్ ప్యాక్ గా ఇవ్వడం జరుగుతుందని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు గారు తెలియజేసారుఅలాగే ఈ అవకాశాన్ని ఉద్యోగస్తులు అందరూ తప్పక సద్వినియోగపరచుకోవాల్సిందిగా సూచించారు.

# చుంచుపల్లి తండాలో సెంట్రల్ టీం



**చుంచుపల్లి జులై 28 (స్మై న్యూస్ ):**స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ -2025 సర్వే లో భాగంగా సెంట్రల్ టీం చుంచుపల్లి తండా గ్రామ పంచాయతీ లోని అంగన్వాడి సెంటర్, హెల్త్ సబ్ సెంటర్, ప్రాథమిక ఉన్నత పాఠశాల, చర్చి ని సందర్శించి టాయిలెట్ సదుపాయం లను గ్రామ పంచాయతీలో కంపోస్ట్ ఎరువు తయారీని తడి చెత్త పొడి చెత్త నిర్వహణ విధానంను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుభాషిని రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్ జయంత్ , ఎస్బీఎం జిల్లా కోఆర్డినేటర్ రేవతి , పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, రమేష్, రఘు లు పాల్గొనడం జరిగింది.

# విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షురాలిగా బందీగి సురేఖ



**నారాయణపేట జులై 28 (స్మైన్యూస్)** విశ్వహిందూ పరిషత్ నారాయణపేట జిల్లా అధ్యక్షురాలిగా బందిగి సురేఖ రాంబాబు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ మధ్యనే విశ్వహిందూ పరిషత్ నారాయణపేట జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాంబాబు ఆకస్మిక మరణం చెందిన విషయం తెలిసినదే. ఈయన మరణం తర్వాత కూడా డాక్టర్ రాంబాబు సతీమణి సురేఖ విశ్వహిందూ పరిషత్ కార్యక్రమాల్లో పాల్గొంటూ వస్తున్నారు. డాక్టర్ రాంబాబు సైతం సుమారు నాలుగు నెలల పాటు చురుకుగా విశ్వహిందూ పరిషత్ కార్యక్రమాలను నిర్వహించి జిల్లాలో మంచి పేరును తెచ్చుకున్నారు. ఈ మేరకు ఆయన స్థానంలో డాక్టర్ రాంబాబు సతీమణి సురేఖ రాంబాబును జిల్లా అధ్యక్షురాలిగా ప్రకటిస్తూ యాదగిరిగుట్టలో జరిగిన రాష్ట్ర ప్రాంత విశ్వహిందూ పరిషత్ సమావేశంలో పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. తన భర్త ఆశయ సాధన కోసం కృషి చేస్తానని... నారాయణపేట జిల్లాలో విశ్వహిందూ పరిషత్ ఉన్నతికి... హిందూ ధర్మరక్షణ కోసం పాటుపడతానని ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు తెలిపారు.

# పేద విద్యార్థులకు చేయూతనివ్వడం ఆత్మసంతృప్తి





**నాగర్ కర్నూల్ జులై 28 (స్మైన్యూస్)** ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు చేయూత ఇవ్వడం ద్వారా ఎంతో ఆత్మ సంతృప్తి కలుగుతుందని వాసవి క్లబ్ వనితా క్లబ్ అధ్యక్షులు అర్థం లలితా సాయి కృష్ణ అన్నారు సోమవారం మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఇరువంటి బాలయ్య ఆర్థిక సహాయంతో బీరువాను పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపాదించిన వాటిలో ఎంతో కొంత సేవా కార్యక్రమాలకు వెచ్చించాలని కోరారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అనేక సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం జరుగుతుందని అనేకమంది పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు ఆర్థిక సాయంతో పాటు అనేక పాఠశాలలో మౌలిక వసతులను కల్పించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కురుమయ్య రమేష్ భాస్కర్ వాసవి క్లబ్ కార్యదర్శి గుంతశేఖర్ తదితరులు పాల్గొన్నారు

## కలెక్టర్ కి వినతి పత్రం అందజేసిన
# అజ్జకొల్లు గ్రామ యువకులు...



**దేవరకద్ర మదనాపురం జులై 28 (స్కై న్యూస్):**వనపర్తి జిల్లా మదనాపురం మండలం అజ్జకొల్లు గ్రామానికి చెందిన యువకులు కలెక్టర్ ని మర్యాద పూర్వకంగా కలసి ఆటస్థలం ఏర్పాటు కొరకై వినతి పత్రాన్ని అందించడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ యువకులు మాట్లాడుతూ గ్రామంలో ఎంతో మంది విద్యావంతులు, మేధావులు, నాయకులు ఉన్న మన గ్రామంలో ఎందుకో ఆటస్థలం ఏర్పాటు చేయడం లో నిర్లక్ష్యం చేశారు, దాదాపు 1500 వందల సంఖ్యలో వయోజన ఓటు హక్కు కలిగి ఉన్న యువకుల ఓట్లతో కొన్ని పర్యాయాలుగా అధికారంలో ఉన్నతమైన పదవులు పొందిన కూడా గ్రామ యువతీ యువకుల ఎన్నో ఏళ్ళ చిరకాల కోరిక అయిన ఆటస్థలం. ఆ కోరిక ఒక కలగానే మిగిల్చి క్రీడా స్థలం ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం చేశారు.క్రీడలు కేవలం శారీరక ఆరోగ్యానికి మాత్రమే కాకుండా మానసిక ఉల్లాసం ఉత్సాహంతో కూడుకున్నవి కావున రాష్ట్రంలో వివిధ స్పోర్ట్స్ విభాగాల్లో రాణించిన ఎందరో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన మట్టిలో మాణిక్యాలు కేవలం రాష్ట్రస్థాయిలోనే కాకుండా యావత్ ప్రపంచంలో కిరీటాలు పొంది చాంపియన్ లు గా నిలిచిన వారినెందరినో ఇదివరకే మనమంతా చూశాం.మన గ్రామంలో కూడా ఎంతో మంది యువతీ, యువకులు క్రీడల్లో మక్కువ చూపుతున్నా సరైన క్రీడా ప్రాంగణం లేకపోవడం వల్ల తమ ప్రతిభను కనభరిచే అవకాశాలు కోల్పోతూ ఛాంపియన్ లు కావాల్సిన యువకులు చెడు వ్యసనాలకు పాల్పడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి అన్నారు.క్రీడా స్థలం ఏర్పాటుతో గ్రామ యువతీ, యువకులు చెడు వ్యసనాలకు పాల్పడకుండా, ఆటలపట్ల మొగ్గు చూపుతూ తమ శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకునే అవకాశం ఉంటుందని కోరుకుంటూ తక్షణమే చర్యలు తీసుకోని మ గ్రామంలో క్రీడాస్థలం ఏర్పాటు చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం ఇచ్చి నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు రుద్రాచారి, వాకిటి రమేష్, గుండ్రాతి అశోక్ గౌడ్, పి. అశోక్, కావలి అశోక్ కుమార్, హరీష్, హరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 46 దరఖాస్తు లు

**ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి : అదనపు కలెక్టర్**





**నారాయణపేట జూలై 28 (స్కైన్యూస్)** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ వెంటవెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లెలోని చెరువు అలుగు పనులు
# పునర్నిర్మాణం వెంబడే చేపట్టాలి





**నారాయణపేట జూలై 28 (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా కేంద్రంలో కలెక్టర్ ఆఫీసులో ఏవో సుధారాణి , ఇరిగేష ఏ ఈ కి మల్లెలోని చెరువు అలుగు పునర్నిర్మానం పనులు వెంటనే చేపట్టాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి యాదగిరి మాట్లాడుతూ గతంలో అధిక వర్షాలు కుర్చడం వలన ఇరిగేషన్ రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు అలుగును తొలగించడం జరిగింది. ఈ అలుగు తొలగించడంతో చెరువు లోని నీరు మొత్తం కూడా బయటికి పోవడం జరిగింది ఈ అలుగు పనులు చేపట్టకపోవడంతో ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు నీరు చెరువులోకి వెళ్లి బయటకు పోవడం జరుగుతుంది కాబట్టి వెంటనే ఈ అలుగు పనులు చేపట్టాలని ఆయకట్టు దారులు రైతులు కోరుతున్నారు గతంలో కూడా ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ని కలవడం జరిగింది. ఈ పనులు వెంబడిచే పడతామని హామీ కూడా ఇవ్వడం జరిగింది ఇప్పటివరకు పనులు చేపట్టలేదు ఈ పనులు వెంటనే చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు కూడా విన్నవించిన పెడచెవిన పెడుతున్నారు ఈ పనులు చేపట్టనియెడల మా సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో టి యు సి ఐ జిల్లా ఉపాధ్యక్షులు బి నరసింహ, ఏఐపీకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ రాములు, ఏఐయుకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఏ రాములు, ఆయకట్టుదారులు దస్తప్ప, రఘు, గుండెగరి లక్ష్మయ్య, వెంకటేష్, నర్సిములు, రాములు, బాలు, జెట్టి అంజి, మార్కండీ, ఎం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ అధికారుల కోసం
## వడిగాపులు కాస్తున్న ప్రజలు

**-బీసీ పొలిటికల్ జేఏసీ మదనపూర్ మండల అధ్యక్షులు బి. మహేందర్ నాయుడు**



**దేవరకద్ర, మదనాపూర్ జూలై 28 (స్కై న్యూస్):**మండల అధికారి సమయం పాటించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్న వివిధ గ్రామాల ప్రజలు అన్నారు. ప్రభుత్వ జీతాలు వేలల్లో తీసుకుంటూ సమయానికి విధుల్లోకి రాకపోవడం, ఇష్టరీతిగా వ్యవహరించడంతో తీవ్ర ఇబ్బందుల్లో సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్నారు అన్నారు.లీడర్లు వస్తనేమో నిమిషాల్లో పని చేయడం సామాన్య ప్రజలు వస్తే పనిచేయకపోవడం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అన్నారు. డబ్బులు ఇస్తేనే పనిచేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న మండల ప్రజలు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా మదనాపూర్ ఎమ్మార్వో కిందిస్థాయి అధికారులపై దృష్టి సారి%శీ%చాలి అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల తరుపున రైతుల తరఫున తాసిల్దార్ కు వినతి పత్రాన్ని బిసి పొలిటికల్ జేఏసీ ఉద్యమిస్తున్నుంది హెచ్చరించారు.ప్రజలకు ఇబ్బందిపెట్టని అధికారులకు తోడుంటాం అవినీతి చేసిన అధికారులను చర్యలు తీసుకునే వరకు పోరాడతాం డిమాండ్ చేశాడు

# జగన్ అరస్ట్ అంత తేలిక కాదు.?



**అమరావతి:** వైసిపి హయాంలో జరిగిన మద్యం కుంభకోణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా ఉన్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో 13 మందిని అరెస్టు చేశారు. వీరిలో రాజంపేట ఎంపీ, వైసిపి కీలక నాయకుడు మిథున్ రెడ్డి, సహా ఐఏఎస్ అధికారి ధనంజయ రెడ్డి, అదేవిధంగా గత ముఖ్యమంత్రి జగన్ దగ్గర పనిచేసిన ఓఎస్ డి లు, పార్టీ నాయకులు కూడా ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వంటి వారిని కూడా ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు అరెస్ట్ చేశారు. ఇక ఇప్పుడు ఈ కేసును మరింత లోతుగా విచారించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.ఈ పరిణామాలు ఎలా ఉన్నా ఈ కేసులో ప్రధానంగా జగన్ ను అరెస్ట్ చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ విషయం అందరికీ తెలిసిందే. దీనిపై ఇప్పటికే అనేక కథనాలు వార్తలు కూడా వచ్చాయి. అయితే ఇతర వ్యక్తులను లేదా ఇతర వైసీపీ నాయకులను అరెస్ట్ చేసినంత ఈజీగా జగన్‌ను అరెస్ట్ చేసే పరిస్థితి లేదు. దీనికి అనేక రాజకీయ కారణాలు ప్రజల్లో ఏర్పడే సింపతీ వంటి కారణాలు కూడా కనిపిస్తున్నాయి. ప్రజల్లో సింపతీ పై రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇప్పుడు ఉన్నటువంటి పరిస్థితులు జగన్ అరెస్ట్ చేస్తే ఎలాంటి సింపతి వస్తుంది.. ప్రజల్లో ఆయన పట్ల సానుభూతి ఉందా లేదా అనే విషయాలను అంచనా వేసి నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తుంది.కానీ రాజకీయంగా చూసుకున్నప్పుడు మాత్రం ఈ విషయంలో ప్రభుత్వానికి కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధానంగా కేంద్రాల్లోని బిజెపి నాయకులు దీనికి సంసిద్ధత వ్యక్తం చేయడం లేదన్నది కూటమి ప్రభుత్వంలోని నాయకులు మధ్య జరుగుతున్న చర్చగా ఉంది. ఎందుకంటే బిజెపి రాజకీయాలు ఇప్పుడు వ్యూహాత్మకంగా ఉంటాయి. ఒకే పార్టీతో అది అంటకాగడమన్న సమస్య ఉండదు. ఎప్పుడు ఏ అవసరం ఎలా వచ్చినా వినియోగించుకునేందుకు ఏ పార్టీ నైనా వాడుకునేందుకు బిజెపి నాయకులు రెడీగా ఉంటారు.కేంద్రంలో తరచుగా అవసరాలు వస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం ఉప రాష్ట్రపతి ఎన్నిక కూడా ఉంది. రాజ్యసభలో వైసిపి అవసరం బిజెపికి ఎక్కువగా కనిపిస్తుంది. వైసిపి పక్షాన బిజెపి నాయకులు ఖచ్చితంగా నలబడతారనేది జాతీయ మీడియాలో జరుగుతున్న చర్చ. పైగా ఇప్పటివరకు జరిగిన రాజకీయ పరిణామాలు గమనిస్తే కేంద్రం కోరినప్పుడు రాజ్యసభ సీట్ ఇచ్చారు. అనేక సందర్భాల్లో బిల్లులకు కూడా వైసీపీ తరఫున మద్దతునిచ్చారు. దీంతో వైసీపీకి వ్యతిరేకంగా కేంద్రంలోని బిజెపి నిర్ణయం తీసుకునే అవకాశం లేదు. జగన్ అరెస్టుకు రాజకీయంగా ఇదే ప్రతిబంధకం అవుతుంది అన్నది కూటమిలోనే జరుగుతున్న చర్చ, మొత్తంగా చూస్తే ఈ కేసును పరుగులు పెట్టించడం లేదా అరెస్టులు చేయటం వంటివి రాష్ట్ర ప్రభుత్వం దూకుడుగా ఉన్నప్పటికీ కీలకమైన జగన్ విషయానికి వచ్చేసరికి మాత్రం రాజకీయ ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు మరి ఏం జరుగుతుందనేది చూడాలి.

## విచారణ జరిపించి
## అర్హులకు న్యాయం చేయాలి



**నాగర్ కర్నూల్ జులై 28 (స్కై న్యూస్)** వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సహాయ పరికరాల లబ్ధిదారుల ఎంపికలో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని వెంటనే విచారణ జరిపించి అర్హులకు న్యాయం చేయాలని ఎన్ పి ఆర్ డి జిల్లా అధ్యక్షులు కుర్మయ్య డిమాండ్ చేశారు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకంలో అక్రమాలు చోటు చేసుకోవడం వల్ల నిజమైన లబ్ధిదారులకు అన్యాయం చోటుచేసుకుందని వివరించారు వెంటనే విచారణ జరిపించి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని లేదంటే సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రత్యక్ష ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు

## తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో
# ప్రముఖ పాత్ర జైపాల్ రెడ్డిదే

**హైదరాబాద్ కు మెట్రో జైపాల్ రెడ్డి వల్లే సాధ్యమైంది**

**అయన రాజకీయ జీవితం నేటి తరం నేతలకు ఆదర్శం..స్ఫూర్తి దాయకం**

**అయన స్ఫూర్తితోనే నేను నల్గొండ నుండి 30 ఏళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్నాను**

**మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**

**హైదరాబాద్:**కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా పీవీ నరసింహారావు మార్గ్ (నెక్లెస్ రోడ్) లోని స్ఫూర్తి స్థల్ లో ఆయన స్మారకానికి రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి నివాళు లు అర్పించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ పల్లె నుండి ఢిల్లీ దాకా ఎదిగిన భారత రాజకీయ శిఖరం, బెస్ట్ పార్లమెంటిరియన్ స్వర్గీయ సూదిని జైపాల్ రెడ్డి. 1969లో కల్వకుర్తి ఎమ్మెల్యేగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి అక్కడి నుండే వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తర్వాత మహబూబ్ నగర్,మిర్యాలగూడ,చేవెళ్ల పార్లమెంట్ స్థానాల నుండి ఐదు సార్లు లోక్సభ సభ్యుడిగా గెలుపొందారు. రెండు సార్లు రాజ్యసభ సభ్యుడిగా,రాజ్య సభలో ప్రతిపక్ష నేతగా కూడా పనిచేసిన అపార రాజకీయ అనుభవం కలిగిన నేత జైపాల్ రెడ్డి. ఉత్తమ పార్లమెంటేరియన్గా పురస్కారం అందుకున్న తొలి దక్షిణ భారత ఎంపీగా ఘన కీర్తి పొందారని అన్నారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రముఖ పాత్ర జైపాల్ రెడ్డి దే. హైదరాబాద్ కు ప్రపంచ స్థాయి మెట్రో జైపాల్ రెడ్డి వల్లే సాధ్యమైంది. అధికారంలో ఉన్న,ప్రతిపక్షంలో ఉన్న రాజకీయ విలువలు కలిగి ఉన్న నేత అయన రాజకీయ జీవితం నేటి తరం నేతలకు ఆదర్శం..స్ఫూర్తి దాయకం. జైపాల్ రెడ్డి గురించి చెప్పే అంత పెద్ద స్థాయి నాది కాదు.. ప్రపంచ దేశాలు గుర్తించే నాయకుడు జైపాల్ రెడ్డి. జైపాల్ రెడ్డి పెద్ద కుమారుడు అరవింద్ నేను ఇంజనీరింగ్ లో క్లాస్ మెట్. ప్రజల కోసం నిజాయితీగా పని చేసిన నాయకుడు జైపాల్ రెడ్డి. ఆయనకు భారత రత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వని కోరుతున్నానని అన్నారు.పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కు జైపాల్ రెడ్డి పేరు పెట్టాము. ఐకే గుజ్రాల్ నేతృత్వంలో ఏర్పడ్డ యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో..మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వాల్లో కేంద్ర సమాచార ప్రసార శాఖ, పట్టణాభివృద్ధి శాఖ, పెట్రోలియం, సహజ వాయువుల శాఖ సహా మరికొన్ని శాఖలకు మంత్రిగా పనిచేశారు. వైకల్యానికి గురైన ఎన్నడూ నిరాశ చెందలేదు..అది ఆయన రాజకీయ జీవితానికి ఎన్నడూ అవరోధంగా భావించలేదు. సవాళ్ళకే సవాలుగా నిలిచిన వ్యక్తి జైపాల్ రెడ్డి. విద్యార్థి నాయకుని నుండి కేంద్ర మంత్రి గా ఎదిగారు. సవాళ్ళను సమర్థంగా ఎదుర్కొంటూ ఉన్నతంగా ఎదగాలనే నేటి తరానికి ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితమే నిదర్శనం. జైపాల్ రెడ్డి మంచి వక్త. అపారమైన మేధస్సుతో పాటు అందరినీ ఆకట్టుకునే విశ్లేషణలు ఆయన సొంతం. తెలుగు, ఆంగ్ల భాషల్లో ఆయన అనర్గళంగా మాట్లాడే వారు. పార్లమెంట్ లో ఆయన మాట్లాడుతుంటే నిశబ్దంగా అందరూ వినేవారు. అంతటి విషయ పరిజ్ఞానం కలిగిన వ్యక్తి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో వారు కీలకంగా పనిచేశారు..వారి ఆశయాల మేరకు మా ప్రజా ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం పనిచేస్తున్నది. ఈ సందర్భంగా వారి సేవలు స్మరించకుంటూ ఘన నివాళులు అర్పిస్తున్నాం.” అని మంత్రి అన్నారు.

## బిజెపి అధ్యక్షుడికి సన్మానం



**జోగులాంబ గద్వాల,జులై29(స్కై న్యూస్):**పట్టణం లోని ఎస్ వి ఈవెంట్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు మరియు పాలమూరు పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణమ్మ మాట్లాడుతూ అనంతరం తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామచందర్ రావు డీకే అరుణమ్మ ని సన్మానించిన గద్వాల పట్టణ బిజెపి అధ్యక్షురాలు శ్రీమతి రజక జయశ్రీ నరసింహులు ఈ కార్యక్రమంలో చిత్తారి కిరణ్ తెలుగు రమేష్ వాసు నాయుడు రాంప్రసాద్ నిరంజన్ మొదలగు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు .

## మహిళల భద్రత, ఆన్లైన్ మోసాల పట్ల
## అప్రమత్తంగా ఉండాలి

**పెద్దపల్లి:**రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, పెద్దపల్లి షీ టీమ్ ఇంచార్జ్ ఎస్ ఐ లావణ్య ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కొత్తపల్లి జెడ్పి హెచ్ ఎస్ స్కూల్ విద్యార్థుల కు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా షీ టీం మెంబర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత, ఆన్లైన్ మోసాలపై, యాంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని, ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు, విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళల కు ఏదైనా ప్రమాదం ఉన్నట్ల యితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్, హెడ్ మాస్టర్ మాధురి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సృష్టి కథ..ఇంతింత కాదయా...

**హైదరాబాద్, జూలై 28:**హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ కేసులో పోలీసుల దర్యాప్తులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. అసలు ఈ కేంద్రంలో టెస్ట్ ట్యూబ్ బేబీ (ఐవీఎఫ్) పద్ధతి జరగలేదని.. బయట వేరొకరికి పుట్టిన బిడ్డలను తీసుకొచ్చి, సంతానం లేని దంపతులకు అద్దె గర్భం ద్వారా పుట్టారని నమ్మించి ఇచ్చినట్లు పోలీసులు తేల్చారు. ఈ దారుణ మోసం ద్వారా డాక్టర్ నమ్రత దంపతుల నుంచి రూ.40 లక్షల వరకు వసూలు చేసినట్లు వెల్లడైంది. ఇది కేవలం వైద్య మోసం కాదని.. బిడ్డల అక్రమ రవాణాఅని పోలీసులు పేర్కొన్నారుఈ కేసు వివరాలను నార్త్ జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ మీడియాకు వెల్లడించారు. గోపాలపురంకు చెందిన ఒక జంట ఇచ్చిన ఫిర్యాదుతో సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌పై రైడ్ చేశామని డీసీపీ తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన ఒక దంపతులు ఆన్‌లైన్‌లో సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ గురించి తెలుసుకుని డాక్టర్ నమ్రతను సంప్రదించారు. సరోగసి (అద్దె గర్భం) పద్ధతిలో పిల్లలు పుట్టించడానికి రూ.30 లక్షలు అవుతుందని నమ్రత వారికి చెప్పింది. దీంతో దంపతులు విజయవాడ వెళ్లి, అక్కడ తమ శాంపిల్స్ ఇచ్చారు. సరోగసి కోసం అద్దె గర్భం మోసే మహిళ దొరికిందని డాక్టర్ వారికి నమ్మబలికింది.కొన్ని నెలల తర్వాత బాబు పుట్టాడని ఆ జంటకు డాక్టర్ నమ్రత చెప్పింది. సిజేరియన్ ద్వారా డెలివరీ అయిందని అబద్ధం చెప్పి.. అదనంగా మరో రూ.10 లక్షలు వసూలు చేసింది. దీంతో మొత్తం రూ.40 లక్షలు దంపతుల నుంచి లాగేసింది. అయితే.. కొన్ని నెలల తర్వాత ఆ బాబు పోలికలు ఆ దంపతులకు అనుమానాస్పదంగా అనిపించాయి. దీంతో వారు డీఎన్ఏ టెస్ట్ చేయాలని డాక్టర్‌ను కోరారు. ఇందుకు నమ్రత అస్సలు ఒప్పుకోలేదు. దాంతో దంపతులు ఢిల్లీలో డీఎన్ఏ టెస్ట్ చేయించారు. ఆ పరీక్షలో ఆ బిడ్డ తమకు చెందినది కాదని.. మరొకరి డీఎన్ఏగా తేలడంతో దంపతులు డాక్టర్ నమ్రతను నిలదీశారు. అయితే.. నమ్రత తన కొడుకు జయంత్ కృష్ణతో కలిసి బాధితులను బెదిరింపులకు పాల్పడింది. జయంత్ కృష్ణ తాను న్యాయవాదినని చెప్పుకొని బెదిరించాడు.డాక్టర్ నమ్రత చేసింది నిజానికి సరోగసి కాదు. వేరే మహిళకు పుట్టిన బిడ్డను తీసుకొచ్చి, సరోగసి ద్వారా మీకు పుట్టిన బిడ్డ అని దంపతులను నమ్మించింది. ఢిల్లీకి చెందిన ఒక గర్భిణిని ఫ్లైట్‌లో వైజాగ్ తీసుకొచ్చి, అక్కడ డెలివరీ చేసి, ఆమెకు పుట్టిన బిడ్డను ఆ రాజస్థాన్ దంపతులకు ఇచ్చింది. బిడ్డను వద్దనుకున్న ఆ మహిళకు రూ.90 వేలు చెల్లించినట్లు పోలీసులు గుర్తించారు.సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్‌కు సరైన అనుమతులు లేవని, ఆ ఆస్పత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లకు 2021లోనే గడువు తీరిందని డీసీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు. హైదరాబాద్ మెడికల్ ఆఫీసర్



వెంకట్ కూడా ఈ రైడ్‌లో పాలుపంచుకుని.. 2020లోనే వారి అనుమతులు ముగిశాయని, ఆసుపత్రి మూసేస్తున్నామని వారు చెప్పారని.. క్లోజింగ్ సర్టిఫికెట్ కూడా ఇచ్చామని చెప్పారు. అయినా అక్రమంగా టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌ను నడుపుతున్నారని ఆయన అన్నారు.సెంటర్‌లో థియేటర్, అనస్థీషియా ల్యాబ్, బెడ్స్, 7 రకాల అనాలసిస్ చేసే ఎక్విప్‌మెంట్ ఉన్నాయని, డస్ట్ బిన్ చెక్ చేస్తే రెగ్యులర్ ప్రాసెస్ చేస్తున్నట్లు ఆధారాలు సేకరించామని పోలీసులు తెలిపారు. డాక్టర్ నమ్రతపై రెండు రాష్ట్రాల్లో 10కి పైగా కేసులు ఉన్నాయని, ఐవీఎఫ్ ఫెయిల్యూర్, సరోగసిలో అక్రమాలు వంటి కేసులు ఉన్నాయని డీసీపీ పేర్కొన్నారు. ఈ కేసులో ఇంకా చాలా మందికి పాత్ర ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కేసులో ఇప్పటివరకు 8 మంది నిందితులను అరెస్ట్ చేసి, ఏడుగురిని రిమాండ్‌కు తరలించారు.

**వీర్యాలు మార్చి దందా**

సికింద్రాబాద్‌లోని రెజిమెంటల్‌బజార్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ఘటనలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేంద్రం నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతతో పాటు ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు, వైద్యాధికారులు పలు కీలక పత్రాలు, వీర్య కణాల శాంపిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల దర్యాప్తులో సృష్టి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్‌కు ఇండియన్ స్పెర్మ్ టెక్ సంస్థకు సంబంధాలు ఉన్నట్టు గుర్తించారు. అద్దె గర్భాల కోసం అక్రమంగా వీర్యాన్ని, అండాలను సేకరిస్తున్నట్టు తేలింది.వీర్యం దానం చేసేవారికి ఒక్కొక్కరికి రూ.5- 10 వేల వరకు ఇస్తున్నట్లు తెలిసింది. ఫోర్న్ వీడియోల చూపించి వారితో వీర్యం సేకరిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. వారి ఆరోగ్య పరిస్థితితో సంబంధం లేకుండా వీర్యం దానం చేస్తున్నట్లు తెలిసింది. ఇలా సేకరించిన వీర్య కణాలు, అండాలను గుజరాత్, మధ్యప్రదేశ్‌లకు తరలిస్తున్నట్టు గుర్తించారు. అనుమతులు లేకుండానే రెజిమెంటల్ బజార్‌లో ఇండియన్ స్పెర్మ్‌టెక్ సంస్థను నిర్వహిస్తున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. దీంతో ఆ సంస్థ రీజినల్ మేనేజర్ పంకజ్ సోనీని నిందితుడిగా చేర్చారు. పంకజ్, సంపత్, శ్రీను, జితేందర్, శివ, మణికంఠ, బోరోలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ అక్రమ దందాపై పోలీసులు మరింత లోతైన విచారణ జరుపుతున్నారు.

**ఎఫ్ ఐ ఆర్ లో విస్తుపోయే నిజాలు**

సికింద్రాబాద్‌లోని సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌పై ఈనెల 25న గోపాలపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రాజస్థాన్‌కు చెందిన బాధితురాలు సోనియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. రాజస్థాన్‌కు చెందిన సోనియా దంపతులు ఆగస్టు 2024న డాక్టర్ నమ్రతాను కలిశారు. తమకు సంతానం కావాలని, ఐవీఎఫ్ ప్రొసీజర్ ద్వారా సంతానం కలిగేలా చేయాలని కోరారు. దీంతో డాక్టర్ నమ్రతా ఐవీఎఫ్ ప్రొసీజర్ కోసం వారి నుంచి రూ.30లక్షలు డిమాండ్ చేసింది. దీంతో 15 లక్షల రూపాయలు చెక్కు రూపంలో, మిగిలిన 15 లక్షల రూపాయలు బ్యాంక్ అకౌంట్ ద్వారా దంపతులు ట్రాన్స్ఫర్ చేశారు. ప్రొసీజర్ లో భాగంగా విశాఖపట్టణంలో మరో బ్రాంచ్‌కు శాంపిల్ కలెక్షన్ కోసం ఆ దంపతులను పంపించారు. కేవలం మెడికల్ టెస్టుల కోసం రూ.66వేలు తీసుకున్నట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. పలుసార్లు విశాఖ సెంటర్‌కు పంపించినట్లు బాధితులు పేర్కొన్నారు.విశాఖలోని సృష్టి టెస్టు ట్యూబ్ బేబీ సెంటర్ ద్వారా గతంలో అనేక దారుణాలకు నిర్వాహకులు పాల్పడినట్లు వెలుగులోకి వచ్చింది. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పేద మహిళలను టార్గెట్ చేసి అద్దె గర్భంతో ఆస్పత్రి నిర్వాహకురాలు లక్షలు సంపాదించినట్లు తెలుస్తోంది. గతంలో ఈ ఆస్పత్రిపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి.విజయవాడలోనూ బెంజ్ సర్కిల్ సమీపంలో యూనివర్శల్ సృష్టి ఫెర్టిలిటీ అండ్ రీసెర్చ్ సెంటర్ ఉంది. 2015 నుంచి వీరి దందా కొనసాగుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడయింది. ఈ ఆస్పత్రిపై రెండు సార్లు పోలీసు కేసులు నమోదయ్యాయి. పలు సందర్భాల్లో లైసెన్సునుసైతం రద్దు చేశారు. ఆ తరువాత, వేరేవారి పేరుపై ఈ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. డాక్టర్ కరుణ పేరుపై ఈ సెంటర్ నడుస్తున్నట్లు గుర్తించిన పోలీసులు.. ఆమెకోసం గాలిస్తున్నారు. సంతానం లేమి దంపతులకు సరోగసీ ద్వారా తక్కు ధరకే సంతాన ప్రాప్తి కల్పిస్తామని కృష్ణా, గుంటూరు, విజయవాడ ప్రాంతాల్లో డాక్టర్ నమ్రతా గతంలో స్వయంగా ప్రచారం చేసినట్లు చెబుతున్నారు.

# జలపాతం దగ్గర ఏడుగురు మిస్సింగ్

**వరంగల్, జూలై 28:**వర్షాకాలం ప్రారంభం కావడంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఇదే సమయంలో కొన్ని జలపాతాలు చూడముచ్చటగా కనిపిస్తున్నాయి. అయితే మారుమూల ప్రాంతాల్లో ఉన్న కొన్ని జలపాతాలు ఆకర్షిస్తాయి. కానీ ఇక్కడికి వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అందుకే ఇలాంటి వాటిని గుర్తించి పోలీసులు కొన్ని జలపాతాల వద్దకు వెళ్లేందుకు నిషేధించారు. అయితే కొంతమంది యువత మాత్రం ఇక్కడికి వెళ్లి.. సరదాగా గడపాలని అనుకున్నారు. కానీ అనుకోని పరిస్థితుల్లో అడవిలో చిక్కుకున్నారు. ఆ తరువాత ఏం జరిగిందంటే?ములుగు జిల్లలో బొగత జలపాతం గురించి అందరికీ తెలసిన విషయమే. వర్షాకాలంలో ఇక్కడ అద్భుతమైన దృశ్యం కనిపిస్తుంది. అయితే ఈ జిల్లాలో కేవలం బొగత మాత్రమే కాకుండా మరెన్నో జలపాతాలు ఉన్నాయి. కానీ ఇక్కడికి వెళ్లేందుకు అనువైన రవాణా మార్గం లేదు. అంతేకాకుండా అక్కడ ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయి. దీంతో వాటిని నిషేధించారు. అలా నిషేధం ఉన్న జలపాతాల్లో గుడి చెరువు జలపాతం ఒకటి.ములుగు జిల్లాలోని వాజేడు మండలంలోని బొల్లారం అడవిలో ఉన్న ఈ జలపాతాన్ని చూసేందుకు వరంగల్ నిట్ లో చదువుతున్న కొందరు విద్యార్థులు ఇక్కడికి వెళ్లారు. వీరిలో నలుగురు యువకులు, ముగ్గురు యువతులు ఉన్నాయి. . అయితే గుడి చెరువు జలపాతం వద్దకు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో చీకటి పడింది. దీంతో దారి తప్పారు. ఈ క్రమంలో భయాందోళన చెందిన వారు 100 కు డయల్ చేశారు. దీంతో పోలీసులు, అటవీ శాఖ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. మొబైల్ సిగ్నల్ ఆధారంగా వీరిని మొత్తానికి పట్టుకున్నారు. దాదాపు రెండు గంటల పాటు సిబ్బంది కష్టపడి వీరిని పట్టుకొని బొల్లారం గ్రామానికి తీసుకొచ్చారుఈ సందర్భంగా పోలీసులు వారిని మందలించారు. స్నేహితులతో సరదాగా జలపాతాలకు వెళ్లడం సబబే. కానీ నిషేధిత జలపాతాల వద్దకు వెళ్లడంపై కొందరు ఆగ్రహిస్తున్నారు. అంతేకాకుండా సాయంత్రం సమయంలో ఇలా అటవీ ప్రాంతానికి రావడంపై కొందరు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు బీభత్సం సృష్టిస్తున్న నేపథ్యంలో ఇలా రావడంతో ఏదైనా ప్రమాదం జరిగితే ఎలా? అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయం బయటకు రావడంతో చాలా మంది తల్లిదండ్రులు అప్రమత్తం అయ్యారు. తమకు దూరంగా చదువుతున్న తమ పిల్లల గురించి ఆరా తీశారు. అలాగే నిట్ లో చదువుతున్న వారికి తల్లిదండ్రులు ఫోన్ చేసి క్షేమ సమాచారాలు తెలుసుకుంటున్నారు.అయితే జలపాతాల వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నందున%% విద్యార్థులు, యువత ఇక్కడ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. అంతేకాకుండా నిషేధిత జలపాతాల వద్దకు వెళితే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇలాంటి ప్రదేశాలకు వెళ్లినప్పుడు ఇంట్లో వారికి లేదా సంబంధిత కళాశాల యాజమాన్యానికి తెలియజేయాలన్నారు

# పెద్దపులి దాడిలో లేగ దూడ మృతి..

**మంచిర్యాల:**కాసిపేట్ మండలం ధర్మరావుపేట సెక్షన్ పరిధిలో వెంకటాపూర్ బీట్ రొట్టెపల్లి అటవీ శివారు ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం మేతకు వెళ్లిన పశువులపై పులి దాడి చేసి చంపింది. అటవీ క్షేత్రాధికారి బెల్లంపల్లి పూర్ణచందర్ వివరాల ప్రకారం గోందు గూడ కి చెందిన కురిసేంగ అచ్యుత్ రావు యొక్క లేగదూడను పెద్దపులి చంపివేసిందని అయన తెలిపారు. బాధితుడికి నష్టపరిహారం త్వరలోనే చెల్లిస్తామని అటవీ ప్రాంతంలోకి పశువుల కాపరులు సమీప పంట చేనులో పనికి వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెద్దపులికి సంబంధించిన ఆనవాళ్లు కనిపించినచో అటవీ శాఖ వారికి వెంటనే ఇన్ఫర్మేషన్ ఇవ్వాలని కోరారు. సమీప గ్రామాలలో డప్పు చాటింపును చేయించడం జరిగిందని తెలిపారు..

# మా ఆర్థిక వ్యవస్థను స్విచ్చాఫ్ చేసుకోవాలా..?

**రష్యా చమురు కొనుగోలు విషయంలో పశ్చిమ దేశాలపై మండిపడ్డ భారత్**

**న్యూ డిల్లీ జూలై 28:**ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యాపై పశ్చిమ దేశాలు పలు ఆంక్షలు ఉన్నప్పటికీ మాస్కో నుంచి భారత్ పెద్ద ఎత్తున చమురు దిగుమతి చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో రష్యా చమురు దిగుమతి చేసుకోవడంపై పశ్చిమ దేశాలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ వస్తున్నాయి. దీనిపై తాజాగా భారత్ స్పందించింది. పశ్చిమ దేశాల విమర్శలను యూకేలోని భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామి తోసిపుచ్చారు. ఏ దేశం కూడా తమ ఆర్థిక వ్యవస్థను ఆపేయాలని అనుకోదని వ్యాఖ్యానించారు.బ్రిటిష్ రేడియో స్టేషన్ టైమ్స్ రేడియోతో దొరైస్వామి మాట్లాడుతూ.. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు అని తెలిపారు. దేశ అవసరాల్లో 80 శాతం దిగుమతులపైనే అధారపడుతున్నట్లు చెప్పారు. రష్యా నుంచి చౌక ధరకు చమురు దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు. అవసరాల మేరకు డిస్కౌంట్‌పై చమురును ఎలా కొనుగోలు చేయకుండా ఉంటాం..? అని ప్రశ్నించారు. పశ్చిమ దేశాలు భారత్‌పై విమర్శలు చేస్తున్నాయన్నారు. 'మేం ఏం చేయాలని పశ్చిమ దేశాలు కోరుకుంటున్నాయి..? మా ఆర్థిక వ్యవస్థను స్విచ్ఛాఫ్ చేసుకోవాలా..?' అంటూ ప్రశ్నించారు.

# కెమెరా లేకుండానే వ్యక్తులను గుర్తించే హూ-ఫై!

**సరికొత్త నిఘా టెక్నాలజీ అభివృద్ధి**

**న్యూఢిల్లీ జూలై 28:** ఎలాంటి కెమెరాలు అవసరం లేకుండా, విజువల్ ఇన్‌పుట్‌తో పనిలేకుండా వ్యక్తులను గుర్తించే హైటెక్ నిఘా టెక్నాలజీని ఇటలీ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఏఐతో పనిచేసే ఈ సాంకేతికతతో వ్యక్తులను, వారి కదలికలను గుర్తించవచ్చని పరిశోధకులు తెలిపారు. ఈ టెక్నాలజీని హూ-ఫై గా వ్యవహరిస్తున్నారు. సాధారణ వైఫై సిగ్నల్‌ని బయోమెట్రిక్ స్కానర్‌గా ఇది మారుస్తుందని వెల్లడించారు. ఫింగర్‌ప్రింట్ స్కానర్, ఫేషియల్ రికగ్నిషన్ వంటి సంప్రదాయ బయోమెట్రిక్ సిస్టమ్స్ మాదిరిగా దీనికి ఫిజికల్ కాంటాక్ట్, విజువల్ ఫీడ్ అవసరం లేదు. కేవలం వైఫై సిగ్నల్స్ ద్వారా ఇది పనిచేస్తుంది.

**ఎలా పనిచేస్తుంది?**

వైఫై సిగ్నల్స్‌ని వ్యక్తి అడ్డుకునే తీరును బట్టి ఈ హూ-ఫై టెక్నాలజీతో ఆ వ్యక్తిని గుర్తించవచ్చని పరిశోధకులు తెలిపారు. వైఫై సిగ్నల్స్ సమీపంలోకి వ్యక్తి వచ్చినప్పుడు, సిగ్నల్ సహజంగా ప్రయాణించే మార్గంలో ఆటంకాలు ఏర్పడతాయి. ఫలితంగా ఒక యూనిక్ ప్యాటర్న్ ఏర్పడుతుంది. చేతి వేలిముద్రలు, ముఖ కవళికలు, రెటీనా నిర్మాణం వంటి బయోమెట్రిక్ సిగ్నేచర్స్ మాదిరిగానే ఇది అత్యంత కచ్చితంగా ఉంటుంది. హూ-ఫై సిస్టమ్ ఈ సిగ్నేచర్‌ను గుర్తించి, వ్యక్తులకు ఆపాదిస్తుంది. ఈ సిగ్నేచర్స్‌పై ఒకసారి దీనికి శిక్షణ ఇస్తే, ఆ వ్యక్తి కదలికలను కనిపెట్టడం మాత్రమే కాకుండా, సుదీర్ఘ కాలం గడచిపోయిన తర్వాత ఆ వ్యక్తి ఆ నెట్‌వర్క్ జోన్‌లోకి తిరిగి ప్రవేశించినపుడు కూడా గుర్తించగలదు. కెమెరాలు, మైక్రోఫోన్లు వంటివాటిని ఉపయోగించవలసిన అవసరం ఉండదు.హూ-ఫై సిస్టమ్‌కు సింగిల్ యాంటెన్నా ట్రాన్స్‌మిటర్, త్రీ-యాంటెన్నా రిసీవర్ ఉంటే సరిపోతుంది. అంటే, దీని కోసం ఖర్చు కూడా తక్కువే. టార్గెట్ ఓ గోడ వెనుక ఉండి, సాధారణ వేగంతో నడుస్తున్నప్పుడు, హూ-ఫై సిస్టమ్ 95.5 శాతం కచ్చితత్వంతో గుర్తించగలిగిందని పరిశోధకులు చెప్పారు. ఆ వ్యక్తి బట్టలు మార్చినా, బ్యాక్‌ప్యాక్ ధరించినా ఈ కచ్చితత్వం మారలేదన్నారు

# బావిలో పడిన ఆటో.. ఒకరి మృతి

**మహబూబాబాద్:**రహదారి పక్కన ఉన్న వ్యవసాయ పాతబావిలో ప్రమాదవ శాత్తు ఆటో పడిన ఘటనలో ఒకరు మృతిచెందగా, ఇద్దరు గాయపడిన ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని మునిగలవీడు గ్రామంలో చోటు చేసుకుంది. మునిగలవీడుకు చెందిన శ్రీరాం నర్సయ్య(65), ఆయన భార్య భారతమ్మ, కుమారుడు మార్కండేయ.. మండలంలోని శ్రీరామగిరి శివారు వెంకటాపు రంలో బంధువుల అంత్యక్రియలకు హాజరై, ఆదివారం అర్ధరాత్రి వారి సొంత ఆటోలో తిరిగి వస్తున్నారు. మునిగలవీడు గ్రామంలోకి వెళ్లే రహదారికి సమీపంలో ఉన్న పాత బావిలోకి ప్రమాదవ శాత్తు ఆటో దూసుకెళ్లింది. ఈ ఘటనలో తండ్రి శ్రీరాం నర్సయ్య అక్కడికక్కడే మృతిచెందారు. భారతమ్మ, మార్కండేయలకు తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎం జిఎం కు తరలి చారు.

# అనకాపల్లి టూ ఫోర్త్ సిటీ...

**హైదరాబాద్, జూలై 28:**అనకాపల్లి బీజేపీ పార్లమెంటు సభ్యుడు సీఎం రమేష్ కు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మధ్య మాటల యుద్ధం కొనసాగుతుంది. కౌంటర్లు ప్రతి కౌంటర్లు జరుగుతున్నాయి. బీఆర్ఎస్ మరోసారి తెలంగాణ సెంటిమెంట్ రాజకీయాలను తీసుకు వచ్చి మరోసారి అధికారం చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు కనపడుతుంది. మరొకవైపు ఈ వివాదంలో పారిశ్రామికవేత్త, కాంట్రాక్టరు సీఎం రమేష్ పేరు తెలంగాణ రాజకీయాల్లోకి వచ్చింది. వాస్తవానికి సీఎం రమేష్ టీడీపీలో ఆది నుంచి కొనసాగుతూ 2019 ఎన్నికల తర్వాత బీజేపీలో చేరిపోయారు. ఇప్పటి వరకూ సీఎం రమేష్ నాయుడు ప్రత్యక్ష రాజకీయాల్లో పోటీ చేయలేదు. రాజ్యసభ సభ్యుడిగానే ఎన్నికయ్యారు.. తొలిసారిగా సీఎం రమేష్ బీజేపీ అభ్యర్థిగా కడప నుంచి కాకుండా అనకాపల్లి నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం అనకాపల్లి బీజేపీ ఎంపీగా ఉన్న సీఎం రమేష్ కు చెందిన రిత్విక్ కనస్ట్రక్షన్ అటు ఆంధ్రప్రదేశ్ లోనూ, ఇటు తెలంగాణలోనూ అనేక కాంట్రాక్టులు చేపట్టినట్లు చెబుతున్నారు. ఏపీలో పనులు చేపడితే ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ తెలంగాణలో పనులు చేపట్టడంతోనే వివాదానికి కారణమయింది. నిజానికి ఏ1 కాంట్రాక్టు సంస్థ రాష్ట్రాలతో సంబంధం లేకుండా ఎక్కడైనా



పనులు చేపట్టవచ్చు. ఎందుకంటే అరుణాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల్లో కూడా తెలుగు వారికి చెందిన కాంట్రాక్టు సంస్థలు పనులు చేపట్టాయి.ఎందుకంటే టెండర్లు దక్కించుకుని ఎక్కడైనా ఏ సంస్థ అయినా పనులు చేపట్టే అవకాశముంటుంది. కానీ తెలంగాణ విషయానికి వచ్చేసరికి కొంత తేడా వస్తుంది. 2014 కు ముందు వరకూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్న ప్రాంతం రెండుగా విడిపోవడంతో సెంటిమెంట్ వర్క్ అవుట్ అవుతుంది. ఏపీ రాజకీయ పార్టీలు, తెలంగాణ పొలిటికల్ పార్టీలుగా విడిపోయాయి. అందుకే ఇప్పుడు సీఎం రమేష్ అంశం తెలంగాణలో వివాదంగా మారింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల్లో సీఎం రమేష్ ప్రమేయం ఉందని కేటీఆర్ ఆరోపించడంతో పాటు ఫోర్త్ సిటీలోనూ పదహారు వందల కోట్ల రూపాయల పనులు తీసుకున్నారని అనడంతో రగడగా మారింది.. తెలంగాణ ప్రాంతంలో బీజేపీ ఎంపీ, మొన్నటి వరకూ టీడీపీలో ఉన్న సీఎం రమేష్ ఆ పనులను దక్కించుకోవడాన్ని కేటీఆర్ తప్పు పడుతున్నారు. ఏపీకి చెందిన టీడీపీ నేతలు, బీజేపీ నేతలతో రేవంత్ రెడ్డికి ఉన్న సంబంధాలను గురించి తెలంగాణ ప్రజలకు తెలియజెప్పడంలో భాగంగా సీఎం రమేష్ ను బయటకు తీసుకు వచ్చారు. ఈ నేపథ్యంలోనే సీఎం రమేష్ కూడా కేటీఆర్ పై విరుచుకుపడ్డారు. బీజేపీలో విలీనం చేయడానికి కేటీఆర్ ప్రయత్నం చేశారంటూ ఆయన చెప్పి దీనికి కౌంటర్ ఇచ్చారు. ఇలా సెంటిమెంట్ తో గులాబీ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకోవడానికి ప్రయత్నిస్తుండగా, సీఎం రమేష్ మాత్రం నిబంధనల ప్రకారమే తనకు దక్కినట్లు పరోక్షంగా ఒప్పుకోవడం ఇక్కడ విశేషం. మొత్తం మీద మరోసారి సెంటిమెంట్ రాజకీయాలు సీఎం రమేష్ కాంట్రాక్టు రూపంలో బయటకు వచ్చినట్లు కనిపిస్తున్నాయి. మరి అవి ఏ మేరకు పనిచేస్తాయన్నది చూడాల్సి ఉంది.

# దశాబ్దకాలం తర్వాత నిజమైన తెలంగాణ పోరాట యోధులకు గుర్తింపు

**సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే అసలైన ఉద్యమకారులకు న్యాయం**

**తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**

**ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కు తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ స్మారక పురస్కారం**

**రవీంద్రభారతిలో కన్నుల పండువగా తెలంగాణ సన్మాన్ పురస్కారాల ప్రధానోత్సవం**

**హైదరాబాద్, జూలై 28:**దశాబ్ద కాలం తర్వాత నిజమైన తెలంగాణ పోరాట యోధులకు గుర్తింపు లభించడం అభినందనీయమని తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు.ఆదివారం తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షులు నారగొని పురుషోత్తం నేతృత్వంలో రవీంద్రభారతిలో తెలంగాణ సన్మాన్ 2025 పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీర్ల ఐలయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కు తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ స్మారక పురస్కారాన్ని బీర్ల ఐలయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయ సంస్థ జాయింట్ సెక్రెటరీ శ్యాం ప్రసాద్ లాల్ సభకు అధ్యక్షత వహించారు. భాషాభివృద్ధి సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ గౌరవ అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మికి వీరనారి చిట్యాల ఐలమ్మ స్మారక పురస్కారాన్ని అందజేశారు. వీరితో పాటు సీనియర్ ఫిలిం క్రిటిక్ పొన్నం రవిచంద్రకు పైడి జయరాజ్ స్మారక పురస్కారం, ప్రముఖ గాయకులు దరువు అంజన్నకు ప్రజా యుద్ధ నౌక గద్దర్ స్మారక పురస్కారం, సీనియర్ పాత్రికేయులు కాసుల ప్రతాపరెడ్డికి తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి స్మారక పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే అసలైన ఉద్యమకారులకు గుర్తింపు లభిస్తోందని అన్నారు. పది సంవత్సరాలుగా ఉద్దేశపూర్వకంగా అనగదొక్కిన కవులు, కళాకారులకు అసలైన గుర్తింపు లభిస్తుందని ఆయన అన్నారు. దొరల గడీలకు భజన చేసే కళాకారులకు తప్ప అసలైన ఉద్యమకారులకు గుర్తింపు లభించలేదని అన్నారు. వివిధ కార్యక్రమాల ద్వారా వారిని గుర్తించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కేవలం తనకు వంత పాడలేదన్న ఉద్దేశంతో కెసిఆర్ దూరం పెట్టిన వారందరిని సీఎం రేవంత్ రెడ్డి గుర్తించి వారి అభిప్రాయాలు ఎలా ఉన్నా సరే ఉద్యమంలో వారు చేసిన పనిని గుర్తించి



ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ అవార్డు గ్రహీత ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ స్థాపించి నాటి అసలు సిసలైన తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు నిస్తూ ప్రోత్సహించే విధంగా కృషి చేయడం అభినందనీయమని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరిట అవార్డు ఇవ్వడంతో తన బాధ్యతను పెంచిందని, ఈరోజు నుంచి మరింత జాగ్రత్తతో తన విధులు నిర్వర్తిస్తానని ఆయన అన్నారు. బీసీ కమిషన్ సభ్యురాలు, చాకలి ఐలమ్మ పురస్కార గ్రహీత రంగు బాలలక్ష్మీ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పుట్టిన గడ్డ నుంచి తాను రావడం, ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకుంటూ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడడం..., సాధించిన రాష్ట్రంలో వివక్షతను ఎదుర్కొంటూ దశాబ్ద కాలం తర్వాత ఇటువంటి సన్మానాన్ని అందుకోవడం సంతోషకరమని అన్నారు.

# ఆగస్టు 23 నాటికి సలహాలు, సూచనలు పంపండి

**ఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఆగస్టు 23వ తేదీన నేషనల్ స్పేస్ డే సందర్భంగా ప్రజలు సలహాలు, సూచనలు పంపాలని పిలుపునిచ్చారు. ఇందుకు నమో యాప్‌ను వాడుకోవాలన్నారు. భారత విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటుతున్నారని మోదీ చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీ 124వ మన్‌కీ బాత్ కార్యక్రమం నేడు ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ.. విజ్ఞానం, క్రీడలు, సంస్కృతిక, భారత్ సాధించి విషయాలపై ఆయన మాట్లాడారు. ఈ క్రమంలో మోదీ.. ఇటీవల కాలంలో భారత్‌లో చాలా విశేషాలు చోటు చేసుకున్నాయని.. అవన్నీ ప్రతి భారతీయుడికి గర్వకారణమన్నారు. ఇటీవల శుభాన్షు శుక్లా ఐఎస్ఎస్‌కు వెళ్లి.. భూమిపైకి చేరుకోగానే దేశమంతా ఆనందంతో, గర్వంతో నిండిపోయిందని పేర్కొన్నారు. చంద్రయాన్-3ని విజయవంతంగా ల్యాండింగ్ చేసిన తర్వాత దేశంలో ఓ ప్రత్యేకమైన శాస్త్రీయ వాతావరణం ఏర్పడిందని తెలిపారు. ప్రస్తుతం పిల్లలు సైతం



స్పేస్ సైన్స్‌పై ఆసక్తి చూపుతున్నారన్నారు. ఇన్‌స్పైర్ మనక్ అభియాన్ గురించి మాట్లాడారు. ఈ పథకం విద్యార్థులను ఆవిష్కరణలు చేసేలా ప్రోత్సహించే కార్యక్రమమని తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి ఐదుగురిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి ఓ కొత్త ఆలోచనతో వస్తారని.. ఇప్పటి వరకు ఇందులో లక్షలాది మంది చేరారన్నారు. భారత్‌లో ఐదేళ్ల క్రితం దేశంలో 50 కంటే తక్కువ స్పేస్ స్టార్టప్స్ మాత్రమే ఉండేవని.. ప్రస్తుతం స్పేస్ రంగంలో 200 కంటే ఎక్కువ స్టార్టప్స్ ఉన్నాయని వివరించారు. ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. దీన్ని ఎలా జరుపుకుంటారు? కొత్త ఆలోచనలను నమో యాప్ ద్వారా తనకు తెలియజేయాలని కోరారు. భారత విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటుతున్నారన్నారు. ఇటీవలి ఇంటర్నేషనల్ కెమిస్ట్రీ ఒలింపియాడ్‌లో దేవేష్ పంకజ్, సందీప్ కూచి, దేవదత్ ప్రియదర్శి, ఉజ్వల్ కేసరీలు మెడల్స్ సాధించి దేశానికి గౌరవం తీసుకువచ్చారన్నారు. అంతర్జాతీయ గణిత ఒలింపియాడ్‌లో భారత విద్యార్థులు మూడు బంగారు, రెండు వెండి, ఒక కాంస్య పతకాన్ని గెలిచారన్నారు. ముంబైలో వచ్చే నెల జరుగబోయే ఆస్ట్రానమి, ఆస్ట్రోఫిజిక్స్ ఒలింపియాడ్ జరుగునుందని చెప్పారు. ఇది అతిపెద్ద ఒలింపియాడ్ అవుతుందన్నారు. భారత్ ఇప్పుడు ఒలింపిక్స్, ఒలింపియాడ్‌లో ముందుకెళ్తోందన్నారు.

# వైతరణి ఉగ్రరూపం : వరద బెడద

**ఒడిశా, భువనేశ్వర్:** రాష్ట్రంలో వరదలతో నదులు పొంగిపొర్లుతున్నాయి. పలుచోట్ల ప్రమాద సంకేతం దాటి తీర ప్రాంతాల్లో కట్టలను బలహీనపరుస్తున్నాయి. నదీతీర ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతుకుతున్నారు. ప్రాణహాని జరగకుండా సమగ్ర యంత్రాంగం చురుకుగా పని చేస్తోందని రాష్ట్ర జల వనరుల శాఖ పేర్కొంది. ప్రధానంగా సువర్ణ రేఖ, వైతరణి, జలకా నదుల్లో వరద ఉధ్ధృతి విపరీతంగా కొనసాగుతోంది. ఈ నదుల్లో నీటిమట్టం పలు తీర ప్రాంతాల్లో గరిష్ట పరిమితికి మించి ఉంది. వైతరణి నది ఆనందపూర్, అఖుపొదా, జలకా నది మథాని తీరం, సువర్ణ రేఖ నది జంసోలా ఘాట్, రాజ్‌ఘాట్ తీర ప్రాంతాల్లో గరిష్ట పరిమితిని మించి ప్రవహిస్తున్నాయి. ఈ నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాల అంచనా.



**ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధం**

రాష్ట్రంలో వరద ముంపు పరిస్థితి తలెత్తే ప్రమాదం పొంచి ఉంది. ఈ పరిస్థితి నివారణ కోసం ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమైంది. నదుల్లో వరద పరిస్థితిని నియంత్రించడానికి ప్రభుత్వం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి కార్యాచరణ ఖరారు చేసింది. అల్ప పీడనం కారణంగా రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీని ప్రభావంతో వివిధ నదుల నీటి మట్టం గణనీయంగా పెరుగుతోంది. నదుల్లో నీటిమట్టం పెరుగుతున్నందున వరద ముంపు పరిస్థితిని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీర్ చంద్రశేఖర్ పాఢి శనివారం విలేకరులకు తెలియజేశారు. అవసరమైతే లోతట్టు వరద తాకిడి ప్రాంతాల్లో ప్రజలను ఖాళీ చేసి సురక్షిత ప్రదేశాలకు తరలిస్తామన్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా బాలాసోర్ జిల్లాలో 4 మండలాలు మళ్లీ ప్రభావితం అవుతాయని భావిస్తున్నారు. వాటిలో బలియాపాల్, భొగొరాయ్, బొస్తా, జలేశ్వర్ ఉన్నాయి.

**నిరంతర నిఘా**

ఉప్పొంగుతున్న నదీతీర ప్రాంతాల్లో పరిస్థితులపై అనుబంధ యంత్రాంగం నిరంతర నిఘా పెడుతోంది. రాష్ట్ర వరద విభాగం రాత్రింబవళ్లు చురుకుగా పని చేస్తుందని చంద్రశేఖర్ పాఢి తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్లకు అప్రమత్తం చేశారు. జాజ్‌పూర్, భద్రక్ %-% బాలసోర్ జిల్లా కలెక్టర్లు నదీతీర ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు, క్షేత్రస్థాయిలో అనుబంధ సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. సువర్ణరేఖ, బుధా'లంగ్, మహానది, బ్రాహ్మణి, వైతరణి వ్యవస్థ నుంచి చీఫ్ ఇంజినీర్లు, బేసిన్ మేనేజర్లు జిల్లా యంత్రాంగంతో సమన్వయ కార్యాచరణను పర్యవేక్షిస్తున్నారు. భువనేశ్వర్ నుంచి ఇద్దరు ఇంజినీర్ ఇన్ చీఫ్‌లను ప్రభావిత ప్రాంతాలకు తరలించారు. ఈ ఉన్నతాధికారులు సువర్ణరేఖ బేసిన్, వైతరణి బేసిన్ పరిధిలో వారు క్షేత్రస్థాయిలో వరద నిర్వహణను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. ఈ రెండు నదుల్లో నీటి మట్టాలు ప్రమాద స్థాయిని దాటిన తర్వాత ఈ అధికారులను తరలించారు.

**వైతరణి ఉగ్రరూపం**

భద్రక్ జిల్లా అఖుపొడా తీరంలో వైతరణి ఉగ్రరూపం దాల్చుతోంది. ఈ మేరకు కలెక్టర్ వరద హెచ్చరికను జారీ చేశారు. చాంద్‌బాలి, ధామ్‌నగర్‌లు తీవ్రంగా, భొండారి, పొఖొరి ప్రాంతాలు పాక్షికంగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. నదీతీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మయూర్‌భంజ్ జిల్లాలో రాసగోవింద్‌పూర్, మోర్దా, ఘలియాపడా, చిత్రాడ్ మొదలైన ప్రాంతాల్లో ఎగువ పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా జలకా నది నీటిమట్టం పెరుగుతోంది. ఇటీవల ఈ ప్రాంతం వరదలకు గురై వందలాది హెక్టార్లలోని వరి పొలాలు నాశనమయ్యాయి. ఈ పరిస్థితి దిగజారకుంటే బొస్తా మండలంలో 8 పంచాయతీలు, సదర్ మండలంలో 2 పంచాయతీలు ప్రభావితం అవుతాయని భయపడుతున్నారు. వివిధ ప్రదేశాల్లో కరకట్టలు బలహీనంగా ఉండడంతో నదీతీర ప్రాంత ప్రజలు బిక్కు బిక్కుమంటున్నారు.

# మన్సాదేవీ ఆలయంలో తొక్కిసలాట..
# ఫేక్ వార్త ప్రచారమే కారణం!

**డెహ్రాడూన్:** ఉత్తరాఖండ్‌లో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. హరిద్వార్ మన్సాదేవీ ఆలయంలో తొక్కిసలాట జరిగింది. ఈ ప్రమాదం కారణంగా ఆరుగురు భక్తులు మృతి చెందగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వివరాల ప్రకారం.. హరిద్వార్‌లోని మన్సాదేవి ఆలయం వద్ద ఆదివారం ఉదయం అపశ్రుతి చోటు చేసుకుంది. శ్రావణమాసం, ఆదివారం కావడంతో ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. జులై 23వ తేదీన మాస శివరాత్రి జలాభిషేకం తర్వాత, లక్షలాది మంది కన్వర్ యాత్రికులు, సామాన్య ప్రజలు ఇప్పటికే హరిద్వార్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో భక్తులు భారీ సంఖ్యలో అక్కడి చేరుకోవడంతో.. ఆలయంలో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. తొక్కిసలాట ఘటనపై డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ (డీఎం) మయూర్ దీక్షిత్ మాట్లాడుతూ "విద్యుత్ తీగ తెగిపోయిందనే పుకారును ఎవరో వ్యాప్తి చేశారని ఫోటోలు, వీడియోల ద్వారా తెలిసింది. గాయపడిన వారు, మృతులు విద్యుత్ షాక్‌కు గురైనట్టు ఎలాంటి ఆధారాలు లేవు.



ఈ పుకారును ఎవరు వ్యాప్తి చేశారనే దానిపై దర్యాప్తు చేస్తాం. మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించాం. సీసీటీవీ కెమెరాలు, ఇతర మార్గాలను పరిశీలిస్తాం. ఈ ఘటనలో ఆరుగురు మరణించారు" అని తెలిపారు. మరోవైపు.. తొక్కిసలాట ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ప్రగాఢ సానుభూతి తెలిపారు. "హరిద్వార్‌లోని మానసాదేవి ఆలయ మార్గంలో జరిగిన తొక్కిసలాట బాధాకరం. స్థానిక పోలీసులు, ఇతర సహాయక బృందాలు సంఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టాయి. స్థానిక యంత్రాంగంతో నిరంతరం సంప్రదిస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నాను. భక్తుల భద్రత కోసం మాతృదేవతను ప్రార్థిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. ఇక, శివాలిక్ కొండలపై 500 అడుగుల ఎత్తులో ఉన్న మానసాదేవి ఆలయం, హరిద్వార్‌లోని పంచ తీర్థాలలో ఒకటి. ఇది పాముల దేవత మా మానసా దేవి ఆలయం, పురాతన సిద్ధపీఠాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది.

## గుజరాత్‌లో భారీ వర్షాలు.. ఇళ్లలోకి వరదనీరు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు గుజరాత్ లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. అహ్మదాబాద్ పటాన్‌లోని సిధ్‌పూర్ పట్టణాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో వరదలు పోటెత్తాయి. వరద చేరడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. దాంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మరోవైపు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు ప్రవహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరదలు, ఈదురుగాలుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు, టెలీకమ్యూనికేషన్‌కు అంతరాయం ఏర్పడింది.



## మాకు అంతా ఇక మంచే...
## మాతోశ్రీకి రాజ్ రాకపై ఉద్ధవ్

**ముంబై:** మాతోశ్రీ నివాసానికి తన సోదరుడు రాజ్ ఠాక్రే వచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పడం చాలా ఆనందంగా ఉందని శివసేన సుప్రీం ఉద్ధవ్ ఠాక్రే చెప్పారు. తమ సోదరులిద్దరికీ భవిష్యత్తు బాగుంటుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఉద్ధవ్ 65వ పుట్టినరోజు సందర్భంగా ఆయన నివాసమైన మాతోశ్రీకి రాజ్ ఠాక్రే ఆదివారంనాడు వచ్చారు. ఆరేళ్ల తర్వాత మాతోశ్రీకి రాజ్ ఠాక్రే రావడం ఇదే మొదటిసారి. సోదరుల ఇద్దరూ ఎంతో ఆత్మీయంగా పలకరించుకుంటూ పండుగ వాతావరణాన్ని తలపించారు. అనంతరం మీడియాతో ఉద్ధవ్ ఠాక్రే మాట్లాడుతూ, చాలాకాలం తర్వాత తాము కలుకున్నామని, ఇద్దరూ ఎక్కడైతే పెరిగి పెద్దవాళ్లమయ్యామో అక్కడ కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఇక మంచి భవిష్యత్తు ఉంటుందని తాము అశిస్తున్నట్టు పేర్కొన్నారు. ఉద్ధవ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం సోదరులిద్దరూ దివంగత బాల్‌ఠాక్రే చిత్తరువు బ్యాక్‌గ్రౌండ్‌లో ఫోటోలు దిగారు. ఆ ఫోటను రాజ్ ఆ తర్వాత సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'నా పెద్ద సోదరుడు, శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెప్పేందుకు బాల్ ఠాక్రే నివాసమైన మాతోశ్రీకి వెళ్లాను' అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.



**దగ్గరవుతున్న రాజ్, ఉద్ధవ్**

అవిభక్త శివసేనను 2006లో రాజ్‌థాకరే విడిచిపెట్టారు. ఆ తర్వాత ఎంఎన్ఎస్ పార్టీని స్థాపించారు. అయితే, ఇటీవల కాలంలో తమ మధ్య దూరాన్ని తగ్గించుకునే ప్రయత్నాలు సోదరులిరువురూ చేస్తున్నారు. రాష్ట్ర స్కూళ్లలో మూడో భాషగా హిందీని ప్రవేశపెట్టే నిర్ణయాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వెనక్కి తీసుకుంది. ఇందుకోసం మొదట్నించీ గట్టి పట్టుతో ఉన్న ఠాక్రే సోదరులు ఈ సందర్భంగా నిర్వహించిన విక్టరీ ర్యాలీలో పాల్గొన్నారు. 'కలిసి ఉండేందుకే ఇద్దరూ కలిసాం' అని ఉద్ధవ్ ప్రకటించడం సోదరులిద్దరూ తిరిగి కలవనున్నారనే బలమైన సంకేతాలను ఇచ్చింది.

## దేశంలోనే పేద రైతు..



**భోపాల్:** ఒక రైతు వార్షిక ఆదాయం కేవలం రూ.3. ఈ మేరకు ఇన్‌కమ్ సర్టిఫికెట్‌లో పేర్కొన్నారు. అధికారులు జారీ చేసిన ఈ ఆదాయ ధృవీకరణ పత్రం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో అతడ్ని దేశంలోనే పేద రైతుగా నెటిజన్లు అభివర్ణించారు. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. సత్నా జిల్లా కోఠి తహసీల్ పరిధిలోని నయాగావ్ గ్రామానికి చెందిన 45 ఏళ్ల రాంస్వరూప్ రైతు. ఆదాయ ధృవీకరణ పత్రం కోసం అతడు దరఖాస్తు చేశాడు. జూలై 22న తహసీల్దార్ సౌరభ్ ద్వివేది సంతకంతో ఇన్‌కమ్ సర్టిఫికెట్ జారీ అయ్యింది. రైతు రామ్‌స్వరూప్ వార్షిక ఆదాయాన్ని రూ.3గా ఇందులో పేర్కొన్నారు. ఈ సర్టిఫికెట్ ప్రకారం రాంస్వరూప్ నెలకు 25 పైసలు సంపాదిస్తున్నట్లు తెలుస్తున్నది. కాగా, ఈ ఆదాయ ధృవీకరణ పత్రం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో విమర్శలు వెల్లువెత్తాయి. మధ్యప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వంపై ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మండిపడింది. 'మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ పాలనలో, భారతదేశంలో అత్యంత పేద వ్యక్తిని మేం కనుగొన్నాం. వార్షిక ఆదాయం కేవలం రూ.3, ఇది షాకింగ్ కాదా? ప్రజలను పేదలుగా మార్చే లక్ష్యం? ఎందుకంటే ఇప్పుడు కుర్చీ కూడా కమీషన్ తింటున్నది' అని ఆరోపించింది. మరోవైపు ఈ ఇన్‌కమ్ సర్టిఫికెట్‌పై విమర్శలు రావడంతో సంబంధిత అధికారులు స్పందించారు. 'క్లరికల్ ఎర్రర్' వల్ల ఇలా జరిగిందని వివరణ ఇచ్చారు. కొత్త ఆదాయ ధృవీకరణ పత్రాన్ని జూలై 25న జారీ చేశారు. రాంస్వరూప్ వార్షిక ఆదాయం రూ.30,000గా అందులో పేర్కొన్నారు. అంటే ఆ రైతు నెల సంపాదన రూ.2,500కు పెరిగింది.

## మోదీతో ఏం జరిగిందో ఆయనే చెప్పాలి..
## ధన్‌ఖడ్ రాజీనామాపై ఖర్గే

**బెంగళూరు:** ఆరోగ్య కారణాలతో ఉప రాష్ట్రపతి పదవికి జూలై 21న జగ్‌దీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేసినప్పటికీ ఆయన రాజీనామాకు కారణాలపై ఊహాగానాలు కొనసాగుతూనే ఉన్నాయి. దీనిపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, జగ్‌దీప్ ధన్‌ఖడ్‌కూ మధ్య అంశమని అన్నారు. అసలైన కారణం ఏమిటనే దానిపై తనకు సమాచారం లేదని చెప్పారు. రైతులకు అనుకూలంగా మాట్లాడినందుకే ధన్‌ఖడ్ బలవంతంగా రాజీనామా చేయాల్సి వచ్చిందా అని మీడియా అడిగిన ప్రశ్నకు ఖర్గే స్పందిస్తూ, ఆ విషయాలు తనకు తెలియవని, ఆయన ఎప్పుడూ ప్రభుత్వం పక్షానే ఉండేవారని, అసలు ఏమి జరిగిందనేది ఆయనే చెప్పాలని అన్నారు. రాజ్యసభ చైర్మన్‌గా జగ్‌దీప్ ధన్‌ఖడ్ తన హయాంలో ఎల్లప్పుడూ ప్రభుత్వానికి అనుకూలంగా ఉండేవారని, కీలక అంశాలను లేవనెత్తేందుకు విపక్షాలకు తరచు అనుమతి నిరాకరించేవారని ఖర్గే వ్యాఖ్యానించారు. రైతులు, పేదలు, అంతర్జాతీయ అంశాలు, విదేశాంగ విధానం వంటి పలు అంశాలపై ఏరోజూ రాజ్యసభ చైర్మన్‌గా ఆయన తమకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. దళిత మహిళలు, దళితులు, అట్టడుగు వర్గాలపై అకృత్యాలు, హిందూ-ముస్లిం ఘర్షణల ఘటనలు వంటి అంశాలపై నోటీసులు ఇచ్చి ప్రస్తావించేందుకు ప్రయత్నించినప్పుడు కూడా తమకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదన్నారు. ధన్‌ఖడ్ ఎందుకు రాజీనామా చేశారనేది ఆయనకు, మోదీకి మధ్య అంశమని, ఆ కారణం ఏమిటనేది చెప్పాల్సింది కూడా ఆయనేనని అన్నారు.



VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137